# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ ఆదివారం 13-10-2019 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :26 సంచిక: 66 పేజీలు:4 వెల: రూ.1/-


## మూడు రోజుల్లో వందశాతం బస్సులు నడపాలి: సీఎం కేసీఆర్



హైదరాబాద్, అక్టోబర్ 12: మూడు రోజుల్లో వందకు వందశాతం ఆర్టీసీ బస్సులు నడిపి తీరాలని ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇందుకు కావాల్సిన ఏర్పాట్లన్నీ పూర్తి చేయాలన్నారు. చట్ట విరుద్ధంగా జరుగుతున్న సమ్మెను ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లో గుర్తించదు. సమ్మె చేస్తున్నవారితో చర్చలు కూడా జరపదని తేల్చి చెప్పారు. తమంతట తాముగా అనధికారికంగా విధులకు గైర్హాజరైన వారిని తిరిగి ఎట్టి పరిస్థితుల్లో ఉద్యోగాల్లో చేర్చుకునే ప్రసక్తే లేదు. సమ్మెలో పాల్గొనకుండా విధులు నిర్వహిస్తున్న వారికి సంబంధించిన సెప్టెంబర్ మాసం జీతాలు చెల్లించాలని ఆదేశించారు.

# చెన్నై భేటీతో కొత్త శకం ఆరంభం : ప్రధాని మోదీ




### మహాబలిపురం ఉన్నస్థాయి సమ్మిట్‌లో ప్రధాని మోదీ
### భారత్ ఆథిత్యాన్ని అభినందించిన జిన్‌పింగ్
### సమావేశంలో పాల్గొన్న ఉభయదేశాల ప్రతినిధులు

చెన్నై,అక్టోబర్12(ఆర్ఎన్ఎ): చెన్నై సమావేశం రెండు దేశాల మధ్య కొత్త బంధాన్ని ఏర్పరిచిందని ఇవాళ ప్రధాని మోదీ తెలిపారు. వూహాన్ సమ్మిట్ కొత్త ఉత్తేజాన్ని ఇచ్చిందన్నారు. రెండు దేశాల మధ్య విశ్వాసం పెరిగిందన్నారు. చెన్నై విజన్‌తో కొత్త శకం ఆరంభమైందన్నారు. తమిళనాడులోని కోవలమ్‌లో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, ప్రధాని మోదీ మధ్య భేటీ జరిగింది. చైనా, భారత్‌కు చెందిన ప్రతినిధులు కూడా సమావేశంలో పాల్గొన్నారు. ఎన్ఎస్ఏ అజిత్ దోవల్, విదేశాంగ మంత్రి జైశంకర్, విదేశాంగ కార్యదర్శి విజయ్ గోఖలే ఈ భేటీకి హాజరయ్యారు. తమిళనాడు, చైనా మధ్య బలమైన సాంస్కృతిక, వాణిజ్య సంబంధాలు ఉన్నాయని మోదీ అన్నారు. గత రెండు వేల ఏళ్ల నుంచి భారత్, చైనా ఆర్థిక శక్తులుగా ఉన్నాయన్నారు. భారత్ ఇచ్చిన ఆతిథ్యాన్ని తెగ ఎంజాయ్ చేసినట్లు చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ తెలిపారు. ఇవాళ ప్రధాని మోదీతో కలిసి ఆయన చెన్నైలో జరిగిన భేటీలో పాల్గొన్నారు. ఆ తర్వాత మాట్లాడుతూ.. మీరు ఇచ్చిన ఆతిథ్యం మమ్మల్ని అమితానందానికి గురి చేసిందని జిన్‌పింగ్ చెప్పారు. నేను, మా అధికారులంతా ఇదే ఫీలింగ్‌తో ఉన్నామన్నారు. ఈ అనుభవాలు.. తనకు, తన బృందానికి చిరకాల స్మృతులుగా మిగిలిపోతాయన్నారు. శుక్రవారం మహాబలిపుంలో జరిగిన సమావేశం గురించి కూడా జిన్‌పింగ్ గుర్తు చేశారు. మామల్లపురంలో మనం ఇద్దరు స్నేహితుల్లా మాట్లాడుకున్నామన్నారు. ద్వైపాక్షిక సంబంధాలపై మనస్ఫూర్తిగా చర్చించుకున్నామని జిన్‌పింగ్ చెప్పారు. పెచ్చరిల్లుతున్న విపరీత, తీవ్రవాద ధోరణులు రెండు దేశాలకూ ప్రమాదకరమేనని, వీటిని సంయుక్తంగా ఎదుర్కొందామని భారత్, చైనా నిర్ణయించాయి. భారత పర్యటనకు వచ్చిన చైనా అధినేత జిన్‌పింగ్‌కు ప్రధాని మోదీ శుక్రవారం రాత్రి మహాబలిపురంలోని సముద్రతీర రిసార్టులో ప్రైవేటు విందు ఇచ్చారు. దాదాపు రెండున్నర గంటల సేపు విందు సమావేశం సాగింది. ఇద్దరు నేతలూ వివిధాంశాలపై పరస్పరం అభిప్రాయాలను తెలియజేసు కున్నారు. ఇక ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ.. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు అదిరిపోయే కానుకలు ఇవ్వనున్నారు. వీరిద్దరి మధ్య అధికారిక లాంఛనాలకు దూరంగా సమావేశం జరుగుతున్న విషయం తెలిసిందే. మహాబలిపురం వేదికగా వీరి భేటీ జరుగుతోంది. ఈ సందర్భంగా జిన్‌పింగ్‌కు ప్రధానిమోదీ మంచి కానుకలు సిద్ధం చేశారు. భారతీయ సంప్రదాయం ఉట్టిపడే విధంగా ఉండే మన దేశ కళాకృతులను జిన్‌పింగ్‌కు బహుమతిగా ఇచ్చారు. ఆరు అడుగులు ఎత్తుండే దీపపు స్తంభాలు, మూడు అడుగుల ఎత్తుండే తంజావూరు పెయింటింగ్‌లను కానుకగా ఇచ్చారని అధికారిక వర్గాలు తెలిపాయి. తమిళనాడు హస్తకళా నైపుణ్యాన్ని కళ్లకు కట్టేలా ఇవి ఉండనున్నాయి. బంగారం పూత పూసిన ఇత్తడి దీపపు స్తంభాలు రెండు కలిసి 108 కేజీల బరువు ఉంటాయి. వీటిని తయారు చేయడానికి 12 రోజులు పట్టిందట. సరస్వతి దేవి నృత్యం చేస్తున్న భంగిమలో గీసిన చిత్రలేఖనం మూడు అడుగుల పొడవు, నాలుగు అడుగుల వెడల్పు ఉంటుంది. దీన్ని తయారు చేయడానికి 45 రోజులు పట్టిందట. మరోవైపు ప్రధాని మోదీ కోసం జిన్‌పింగ్ కూడా ఓ కానుకను తెచ్చారని సమాచారం.

# మలేషియా, టర్కీలకు భారత్ షాక్

### ఆ దేశాల నుంచి దిగుమతుల నిలిపివేత
### కశ్మీర్‌పై అనుచిత వ్యాఖ్యలకు గట్టి సమాధానం ఇచ్చిన భారత్

న్యూఢిల్లీ,అక్టోబర్12(ఆర్ఎన్ఎ): జమ్మూకశ్మీర్ విషయంలో మలేషియా, టర్కీ దేశాలు భారతదేశాన్ని విమర్శించిన నేపథ్యంలో ఆయా దేశాల దిగుమతులపై ఆంక్షలు విధిస్తూ కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. మలేషియా, టర్కీ దేశాల నుంచి పామాయిల్ తోపాటు ఇతర సరకుల దిగుమతులపై కేంద్రం ఆంక్షలు విధించింది. దీంతో భారత వాణిజ్య మంత్రిత్వ శాఖ ఆ రెండు దేశాల దిగుమతులను నిలిపివేసేందుకు చర్యలు తీసుకుంటోంది. మలేషియా ప్రధాని మహతీర్ మొహమాద్ ఐక్యరాజ్యసమితి సమావేశంలో కశ్మీర్ విషయంలో భారత తీరును వ్యతిరేకించారు. దీంతో మలేషియా దేశానికి బలమైన సంకేతాన్ని పంపేందుకే ఆ దేశ దిగుమతులపై ఆంక్షలు విధించారు. భారతదేశానికి మూడువంతుల పామాయిల్ మలేషియా నుంచి దిగుమతి అవుతుండేది. భారతదేశం ఏటా మలేషియా, ఇండోనేషియా దేశాల నుంచి 9 మిలియన్ టన్నుల పామాయిల్ దిగుమతి చేసుకుంటుండేది. మలేషియా ప్రధాని వ్యాఖ్యల నేపథ్యంలో ఆ దేశం నుంచి దిగుమతులను నిలిపివేసి, ప్రత్యామ్నాయంగా ఇండోనేషియా, అర్జెంటీనా, ఉక్రెయిన్ దేశాల నుంచి పామాయిల్ ను దిగుమతి చేసుకోవాలని కేంద్రం నిర్ణయించింది. దీంతో మలేషియా దేశానికి షాక్ తగలనుంది.

## చరిత్రలో నేటినిజం



కం॥ ఆదరముగ సేవలనిడి
మేదురముగ ప్రేమ జూపు మేటి మహిళయా
'సోదరి నివేదిత'ను గని
యాదమ్ముల లోకము డిచె 'వర్షా'యనుచున్ !!

( అక్టోబర్ 13 ' సోదరి నివేదిత' పుణ్యతిథి)

–రాధశ్రీ
సెల్: 9494481210



## హుస్సేన్ సాగర్ పరిసరాల్లో నేడు ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్,అక్టోబర్12 (ఆర్ఎన్ఎ):గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హుస్సేన్‌సాగర్ పరిసరాల్లో 10కే, 5కే, 2కే రన్ నిర్వహిస్తోంది. తెల్లవారుజాము 4.30 నుంచి ఉదయం 7 గంటల వరకు సాగర్ పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు కొనసాగుతాయని నగర సీపీ అంజనీకుమార్ తెలిపారు. వాహనదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు సీపీ అంజనీ కుమార్. రన్‌కు సహకరించాలని కోరాం

## తిరుచారపల్లికి ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్,అక్టోబర్12 (ఆర్ఎన్ఎ): హైదరాబాద్–తిరుచిరాపల్లి మధ్య దక్షిణమధ్య రైల్వే 24 ప్రత్యేక రైళ్లను నడిపిస్తున్నది. అక్టోబర్ 14వ తేదీ నుంచి డిసెంబర్ 30వ తేదీ వరకు ప్రతి సోమవారం రాత్రి 10.20 గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరి మంగళవారం సాయంత్రం 7.15 గంటలకు తిరుచిరాపల్లికి చేరుకుంటాయి. అదేవిధంగా అక్టోబర్ 16 నుంచి జనవరి1, 2020 వరకు ప్రతి బుధవారం సాయంత్రం తిరుచిరాపల్లి నుంచి సాయంత్రం 6.05 గంటలకు బయలుదేరి గురువారం సాయంత్రం 4.10 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది. ఈ రైళ్లు సికింద్రాబాద్, నల్గొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ల, గుంటూరు, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, తిరుపతి, పాకాల, చిత్తూరు మీదుగా రాకపోకలు సాగిస్తుంది. ఈ విషయాన్ని దక్షిణమధ్య రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

## మలక్‌పేటలో భారీ చోరీ

### తాళం వేసి ఉన్న ఇంట్లో నగలు దోచుకున్న దొంగలు

హైదరాబాద్,అక్టోబర్12 (ఆర్ఎన్ఎ): తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు పడ్డారు. ఐదు అల్మారాల్లో నుంచి సుమారు 60 తులాల పైగా బంగారు ఆభరణాలు, రూ.4 లక్షల వరకు నగదును దోచుకెళ్లారు. ఈ సంఘటన చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ నాగరాజు కథనం ప్రకారం.. మలక్‌పేట మున్సిపల్ కాలనీలో శ్రీ సాయి రామకృష్ణ, లక్ష్మి ప్రసన్న దంపతులు నివాసం ఉంటున్నారు. రామకృష్ణ రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగి. కాగా.. దంపతులు కొన్ని రోజుల క్రితం ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లారు. వీరింటికి ఎదురుగా ధోబి పని చేసుకునే క్రిష్ణ, కమల దంపతులు వారి ఇంట్లో నిద్రపోయేవారు. క్రిష్ణ అస్వస్థతకు గురికావడంతో గురువారం రాత్రి రామకృష్ణ ఇంట్లో నిద్రపోలేదు. ఉదయం వాకిలి ఊడ్చేందుకు కమల రాగా.. తాళం పగులగొట్టి ఉంది. లోనికి వెళ్లి చూడగా అల్మారాలు తెరిచి ఉన్నాయి. వెంటనే భర్తకు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీంను రంగంలో ఆధారాలు సేకరించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## కాశ్మీర్‌లో మొబైల్ సేవలకు గ్రీన్ సిగ్నల్

హైదరాబాద్,అక్టోబర్12 (ఆర్ఎన్ఎ): అన్ని మొబైల్ సేవలు కశ్మీర్‌లో సోమవారం నుంచి తిరిగి ప్రారంభంకానున్నాయి. 69 రోజుల తర్వాత కేంద్రం ఈ నిషేదాజ్ఞలు ఎత్తివేస్తుంది. ఆర్టికల్ 370 రద్దు అనంతరం పరిస్థితుల అదుపునకు ప్రభుత్వం మొబైల్ సేవలపై ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. వాస్తవానికి పోస్ట్ పేయిడ్ మొబైల్ సేవలు శనివారం నుంచే ప్రారంభం కావాల్సి ఉండగా సాంకేతిక సమస్యల కారణంగా సోమవారానికి వాయిదా వేశారు. కాగా ఇంటర్నెట్ సేవల పునరుద్ధరణకు మాత్రం మరికొంత సమయం పడనున్నట్లు సమాచారం. కశ్మీర్ సందర్శనకు పర్యాటకులకు కేంద్రం ద్వారాలు తెరవడంతో స్థానిక ట్రావెల్ అసోషియేషన్ సంస్థలు అధికారులను ఆశ్రయించి విజ్ఞప్తి చేశారు. మొబైల్ ఫోన్స్ పనిచేయకపోతే పర్యాటకులెవరూ కశ్మీర్ లోయను సందర్శించేందుకు రారని పేర్కొన్నారు.

# ప్రభుత్వంలో ఆర్టీసీ విలీన ప్రసక్తే లేదు

- విలీనం చేస్తామని టీఆర్ఎస్ ఎప్పుడూ చెప్పలేదు
- విధుల్లో చేరనివారు ఆర్టీసీ కార్మికులు కాదు
- ఆర్టీసీని కాపాడుకుంటాం.. ప్రైవేట్‌పరం చేయం
- ప్రభుత్వంపై విపక్షాలవి అసంబద్ద ఆరోపణలు
- సమ్మెతో ప్రజల ఇబ్బందులను విపక్షాలు సమర్థిస్తున్నాయా?
- ప్రయాణికుల సౌకర్యం నిమిత్తం 7358 వాహనాలు నడుపుతున్నాం
- అధిక ఛార్జీలు వసూళ్లుచేస్తే కఠిన చర్యలు
- చర్చల నుంచి ఏకపక్షంగా వెళ్లిపోయింది కార్మిక నాయకులే
- పక్కరాష్ట్రం తొడకోసుకుందని.. మేం మెడకోసుకోం..!
- విలేకరుల సమావేశంలో రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్



హైదరాబాద్, అక్టోబర్12(ఆర్ఎన్ఎ) : ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రసక్తే లేదని, అలా చేస్తామని టీఆర్ఎస్ ఉద్యమ సమయంలోనూ, ఎన్నికల మేనిఫెస్టోలోనూ ఎక్కడా పేర్కొనలేదని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ స్పష్టం చేశారు. శనివారం మంత్రి విలేకరుల సమావేశంలో మాట్లాడారు.. ఆర్టీసీని కాపాడుకొనేందుకు ప్రభుత్వం అన్ని విధాల కృషి చేస్తుందని అన్నారు. ఆర్టీసీని ప్రైవేట్‌పరం చేస్తామని వస్తున్న వార్తలు అవాస్తవమని, ఆర్టీసీని ప్రైవేట్‌పరం చేసే ప్రసక్తే లేదని పువ్వాడ తేల్చిచెప్పారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని ప్రతిపక్షాలు ఆందోళన చేయడం సరికాదని, కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేశాయా అని పువ్వాడ ప్రశ్నించారు. రాష్ట్రంలో ఆందోళనలు చేస్తున్న బీజేపీ నేతలు, కేంద్రం చేస్తున్న పనులను గమనించటం లేదన్నారు. రైల్వేలో ప్రైవేటీకరణ విధానం బీజేపీ రాష్ట్ర నేతలకు కనిపించటం లేదా అని పువ్వాడ నిలదీశాడు. ప్రభుత్వంపై విపక్షాలు అసంబద్ధ ఆరోపణలు చేస్తున్నాయని మండిపడ్డారు. సమ్మెతో ప్రజలకు కలుగుతున్న అసౌకర్యాలను విపక్షాలు సమర్థిస్తున్నాయా అని ప్రశ్నించారు. సమ్మెను ప్రయాణీకుల మీద, ప్రభుత్వం మీద బలవంతంగా రుద్దారని పువ్వాడ పేర్కొన్నారు. ప్రయాణికుల సౌకర్యం నిమిత్తం ప్రభుత్వం 7358 వాహనాలను నడుపుతోందని, బస్సులను నడిపించేందుకు తాత్కాలిక సిబ్బందిని నియమిస్తామన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు ఆర్టీసీ ఆస్తుల విలువ రూ.4416 కోట్లుని విధానపరంగా ఆర్టీసీ ఉండాలని సీఎం కేసీఆర్ చెప్పారన్నారు. మూడేళ్ల కిందట 25 శాతం ఫిట్‌మెంట్ ఇస్తారని అనుకున్న కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం 43శాతం ఇచ్చిందనారు. టిమ్ మిషన్‌లు పనిచేయకుండా నేతలు కుట్రపూరితంగా వ్యవహరించారన్నారు. గతంలో ఆర్టీసీ ఎన్నడూ లాభాల్లో లేదని, కేసీఆర్ రవాణా మంత్రిగా పనిచేసినప్పుడు మాత్రమే ఆర్టీసీ రూ.14 కోట్ల లాభంలోకి వచ్చిందని గుర్తుచేశారు. ఆర్టీసీ లాభాల్లో కొనసాగాలంటే.. 50శాతం ప్రభుత్వ బస్సులు, 30శాతం హైరింగ్, 20శాతం రూట్ పర్మిషన్ బస్సులను నడపాలని నిర్ణయించినట్టు తెలిపారు. అంతే తప్ప ఆర్టీసీని ప్రైవేటీకరణ చేస్తున్నట్టు ఎక్కడా ప్రకటించలేదన్నారు. ఆర్టీసీ ఉండాలని కేసీఆర్ ఇదివరకే కుండబద్దలు కొట్టారని గుర్తుచేశారన్నారు. ఆర్టీసీ కార్మికులు కేవలం 20శాతం ఫిట్‌మెంట్ అడిగితే 44శాతం ఫిట్‌మెంట్ కేసీఆర్ ఇచ్చారన్నారు. ఇటీవలే ఐఆర్ కూడా ఇచ్చారని గుర్తుచేశారు. పక్క రాష్ట్రం వాళ్లు చేసినంత మాత్రానా తెలంగాణలో కూడా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాల్సిన పనిలేదని పువ్వాడ అన్నారు. పక్కనోడు తొడ కోసుకున్నాడని మేము మెడ కోసుకోమన్నారు. ఇక్కడ అమలవుతున్న రైతు బంధు, రైతు భీమా అక్కడ అమలవుతున్నాయా? అని పువ్వాడ ప్రశ్నించారు. రాష్ట్రం ఏర్పడేనాటికి ఆర్టీసీ ఆస్తుల విలువ రూ.4416కోట్లు అని.. కొంతమంది తప్పుడు లెక్కలతో తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. లక్ష కోట్ల ఆర్టీసీ ఆస్తులను కాజేయాలని కుట్ర పన్నారన్న ఆరోపణల్లో నిజం లేదన్నారు. ఆర్టీసీ కార్మికులంతా సమ్మెలో పాల్గొన్న ప్రజలకు ఇబ్బందులు కలగకుండా బస్ సర్వీసులు అందించినందుకు.. ప్రభుత్వం, అందుకు సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు అంటూ పువ్వాడ పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ బస్సుల్లో చార్జీలు అధికంగా వసూళ్లు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ఇప్పటికే చార్జీల వసూళ్లపై నిఘా ఉంచామని అన్నారు.

# ఐటీ రంగంలో దూసుకుపోతున్నాం

- హైదరాబాద్ గ్లోబల్ డిజైన్ డెస్టినేషన్ కాబోతుంది
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్

హైదరాబాద్, అక్టోబర్12 (ఆర్ఎన్ఎ) : ఐటీ రంగంలో తెలంగాణ వేగంగా దూసుకెళ్తుందని, ఔత్సాహికులను అన్ని విధాలా ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. వరల్డ్ డిజైన్ ఆర్గనైజేషన్, తెలంగాణ ప్రభుత్వం, ఇండియా డిజైన్ ఫోరం ఆధ్వర్యంలో హెచ్ఐసీసీలో రెండో రోజు శనివారం వరల్డ్ డిజైన్ అసెంబ్లీ సమావేశాలు జరిగాయి. ఈ సమావేశాల్లో కేటీఆర్, రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్, ఐటీ సెక్రటరీ జయేష్ రంజన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో తొలిసారి వరల్డ్ డిజైన్ అసెంబ్లీ సమావేశాలు జరగడం సంతోషంగా ఉందన్నారు. ఔత్సాహికులను అన్నివిధాలా ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదన్నారు. ఐటీ రంగంలో బెంగళూరు కంటే హైదరాబాద్ శరవేగంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. హైదరాబాద్‌లో టీ-హబ్, టీ-వర్క్స్, ఇమేజ్ టవర్స్ నిర్మాణం జరుగుతుందన్నారు. ఐటీతోపాటు తెలంగాణలో టూరిజం కూడా వేగంగా అభివృద్ధి చెందుతోందని ఆయన చెప్పారు. చేనేతకు తెలంగాణ రాష్ట్రం ప్రసిద్ధి చెందిందని, గద్వాల ,పోచంపల్లి చేనేత పరిశ్రమలు ప్రపంచఖ్యాతి గడించాయని కేటీఆర్ అన్నారు. బాహుబలి లాంటి చిత్రాలనెన్నింటినో అందించిన తెలుగు చిత్ర పరిశ్రమ చాలా పెద్దదని ఈ సందర్భంగా కేటీఆర్ కొనియాడారు. ఔత్సాహికులను తెలంగాణ ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని అన్నారు. నేషనల్ డిజైన్ సెంటర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తామని, ఈ మహానగరం గ్లోబల్ డిజైన్ డెస్టినేషన్ కాబోతుందని కేటీఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం పద్మశ్రీ చింతకింది మల్లేషం తయారుచేసిన ఆసు యంత్రాలను చేనేత కళాకారులకు మంత్రి కేటీఆర్ అందజేశారు.



హైదరాబాద్ హెచ్ఐసీసీలో రెండో రోజు వరల్డ్ డిజైన్ అసెంబ్లీ సమావేశాల్లో పుస్తకాన్ని విడుదల చేసిన ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్. చిత్రంలో రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్, ఐటీ సెక్రటరీ జయేష్ రంజన్ తదితరులు ఉన్నారు.

# మోజంజాహీ మార్కెట్‌లో అగ్నిప్రమాదం

హైదరాబాద్,అక్టోబర్12(ఆర్ఎన్ఎ): అబిడ్స్ పోలీసు స్టేషన్ పరిధిలోని మొజాంజాహీ మార్కెట్ వద్ద అగ్నిప్రమాదం సంభవించింది.

అక్కడున్న ఓ ప్లాస్టిక్ పైపుల గోదాంలో ఆకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేసింది.

షార్ట్ సర్క్యూట్ కారణంగానే అగ్నిప్రమాదం సంభవించినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. భారీగా ఆస్తి నష్టం జరిగింది. సహాయకచర్యలుచేపట్టి మంటలు విస్తరించకుండా చర్యలు తీసుకున్నారు.

# గాయపడుతున్న రహదారులు..

రహదారులు కృంగిపోవడం, గోతులు పడటం లాంటి వాటిపై ప్రజలకు ఏమాత్రం ఆవేదన లేదు. ఎందుకంటే రహదారులు ఏర్పడటం కృంగిపోవడానికే అని తెలుసుకున్నట్లున్నారు పాపం. ముఖ్యంగా నగరంలోని రహదారులు దాదాపుగా గోతులు ఏర్పడి ఉండటం ఒక ప్రతీక మాత్రమే. ఉభయ రాష్ట్రాల్లో మాత్రమే కాదు. దేశంలోని ప్రతి పట్టణంలో , నగరాలలో ప్రధాన రహదారులన్నీ గోతులు ఏర్పడటం, వాహనదారులకు ఇబ్బంది కలిగించడం దాదాపు అందరూ అలవాటు చేసుకున్నారు. ఎందుకంటే అధికారులకు గోతుల్ని పూడ్చే అలవాటు లేదు కనుక జనం గోతుల్లో ప్రయాణం చేయడం అలవాటు చేసుకున్నారు. ఒకవైపు బలమైన రోడ్లను సైతం బద్దలు కొట్టగల బరువైన వాహనాల సంఖ్య రాను రాను పెరిగిపోతుండటం కూడా రోడ్లు కృంగిపోవడానికి ఒక కారణం.

నేటినిజం
ఆదివారం 13-10-2019

ముఖ్యంగా హైదరాబాద్ కూకట్‌పల్లి-జయనగర్ ప్రాంతంలో ఒక ప్రధాన రహదారి కింద ఉన్న మంచినీటి గొట్టం, మురుగునీటి గొట్టం పగిలిపోయి, రోడ్డు కృంగిపోయి పెద్ద గుంత ఏర్పడింది. ఇటీవల కాలంలో హైదరాబాద్‌లో రోడ్డుమీద గుంతలు ఏర్పడటం, వాహనదారులకు ఇబ్బంది కలగటం ఇది మొదటి సారి కాదు. ఇది ప్రత్యేక వార్త కాదు. ప్రధాన రహదారులే కాదు బస్తీలలో, కాలనీలలో కూడా గుంతలు ఏర్పడటం వాహనాలు పడిపోవడం సర్వసాధారణమైపోయింది. ఈ నగర రహదారులను పునరుద్ధరించాలని తెలంగాణ ప్రభుత్వం 'విస్తృత హైదరాబాద్ మహానగర పాలకసంస్థ'-జీహెచ్ఎంసీ భారీగా నిధులను కేటాయించారు. వర్షాలు తగ్గగానే ఈ రహదారుల నిర్మాణం ఏర్పాటు కానున్నదని సమాచారం. ఈ వర్షాలు ఎప్పటికి తగ్గుతాయో కానీ, అప్పటిదాకా మన మహా నాగరికులు ఇలా వైతరణి నీటిలోంచి ప్రయాణించడం, గోతుల్లో పడి మరీ లేచి నడవడం ప్రాక్టీసు చేయడం తప్పదు మరి. దశాబ్దాలుగా వివిధ ప్రభుత్వాలు కేటాయించిన నిధులు నిర్లక్ష్యపు గుంతల్లోనూ, అవినీతి కాలువల్లోను పడిపోవడం రోడ్ల చరిత్రకు కొత్తేమీ కాదు. గ్రామీణ ప్రాంతాల్లో సైతం రహదారుల నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులను కేటాయిస్తోంది. కానీ ఈ వ్యవస్థలో పాతుకుపోయిన అవినీతి రహదారులను కూడా పూడ్చి వేస్తే తప్ప ఈ ప్రభుత్వం అనుకున్న రీతిలో పని జరగదు. ఇలాంటి సమయంలోనే ఒక హిందీ కవి ఇలా అన్నాడు " నిర్మాణోంకీ పావన్ యుగ్‌మే హమ్ చరిత్ర నిర్మాణ్ కరే" అని. దేశంలో నిర్మాణాలు జరుగుతున్న కాలంలో మనుషుల్లో సౌశీల్యం కూడా నిర్మాణమై ఉండాలని అర్థం. ఎందుకంటే నిజాయితీకి దూరమైన విద్యావంతులను, అధికారులను, రాజకీయ నేతలు, వ్యాపారులు దైర్యంగా అవినీతికి బాటలు వేస్తున్నారు. ఇలా దేశం పట్ల, సమాజం పట్ల, మక్కువ లేని విద్యావంతులను, మేధావులను తాము చదువుకున్న పాఠశాలలో చిన్నతనం నుండే అవినీతికి దూరంగా ఉంటే కలిగే ప్రయోజనాలేమిటో, లేకుంటే వచ్చే నష్టాలేమిటో బోధించలేకపోవడమే కారణమేమో అనిపిస్తుంది. అందుకే పాఠ్యాంశాల్లోనే అవినీతి నిర్మూలన గురించి పాఠ్యాంశం చేర్చితే కనీసం రాబోయే తరమైనా సమాజ శ్రేయస్సుపై దృష్టి కేంద్రీకరిస్తారేమో చూడాలి..!

# నేటినుంచి సహస్ర చండీయాగం

## శృంగేరీ పీఠం వారి ఆధ్వర్యంలో నిర్వహణ

## 13వ తేదీ నుంచి 17 వరకు కార్యక్రమాలు

ఖమ్మం,అక్టోబర్12(ఆర్ఎన్ఎ): శృంగేరీ పీఠం వారి ఆధ్వర్యంలో సహస్ర చండీయాగం నిర్వహిస్తున్నారు. ఈనెల 13వ తేదీ నుంచి 17 వరకు కల్లూరు మండలంలోని నారాయణపురం గ్రామంలో మాజీ ఎంపి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఇందుకు ఏర్పాట్లు చేపట్టారు. 5 రోజుల పాటు జరిగే యాగంలో నాలుగు రాష్ట్రాలకు చెందిన అనేక మంది పీఠాధిపతులు హాజరవుతున్నారని, వారు అందించే ప్రవచనాలను ప్రతి ఒక్కరూ పొందాలని పొంగులేటి ఆకాంక్షించారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 200ల మంది రుత్వికులు హాజరవుతున్నారని, ఈ యాగం నిర్వహణలో వారందరూ పాలుపంచుకుంటారన్నారు. ఈ సహస్ర చండీ యాగం శృంగేరీ జగద్గురులు శ్రీశ్రీశ్రీ భారతీతీ మహా స్వామి వారు, శ్రీశ్రీశ్రీ విధిశేఖర భారతీ స్వామి వారి సంపూర్ణ కరుణ, కటాక్ష వీక్షణములతో, వారి మార్గదర్శకంలో వంద సప్తశతి హోమము, లక్ష మూలమంత్ర అవనము కొనసాగి అపూర్వ ఫలాలను అందిస్తుందన్నారు. పీఠాధిపతులతో పాటు దేశంలోని అనేక రాష్ట్రాలలో ఉన్న ప్రముఖులు, రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, వివిధ వర్గాలకు చెందిన మేధావులు ప్రతి ఒక్కరూ హాజరవుతున్నారని పొంగులేటి పేర్కొన్నారు. 13వ తేదీ నుంచి ప్రతి రోజు ఉదయం 8 గంటలకు యాగం ప్రారంభమై మధ్యాహ్నం 1 గంట వరకు పూర్తవుతుందని, తిరిగి సాయంత్రం 4 గంటలకు ప్రారంభమై రాత్రి 7 గంటలకు ముగుస్తుందన్నారు. చండీమాత అనుగ్రహం జిల్లా ప్రజలతో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని ప్రజలందరిపై ఉండాలని ఈ యాగాన్ని నిర్వహిస్తున్నాని తెలిపారు. ప్రజలందరూ హాజరై చండీ మాత దీవెనలు పొందాలని కోరారు. చండీయాగం ఫలితం ఉమ్మడి తెలుగు ప్రజల అందరికి చేరాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలనే ఉద్దేశ్యంతో ఈయాగం నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును కూడా ఆహ్వానించానని ఆయన తప్పకుండా హాజరయ్యే అవకాశం ఉందని పొంగులేటి స్పష్టం చేశారు. అదేవిధంగా సకల జనులు సౌభాగ్యాన్ని, సుఖసంతోషాలను అందించేందుకే ఈ యాగాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ యాగంలో పాలుపంచుకుని చండీ మాత ఆశీర్వాదాన్ని దీవెనలను పొందాలన్నారు.

# గ్రామాల అభివృద్ధికి ఇదే స్ఫూర్తి కొనసాగాలి

## సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టితోనే కార్యాచరణ సాకారం

## మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు వెల్లడి

జనగామ,అక్టోబర్12(ఆర్ఎన్ఎ): గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా 30 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలిచిందని గ్రామీణాభివృదద్ఇ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించారనీ, ఇందులో భాగంగానే 30 రోజుల కార్యాచరణ ప్రణాళికను పల్లెల్లో పకడ్బందీగా వందశాతం అమలు చేసినట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందన్నారు. ప్రణాళికతో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలన్నింటికీ పరిష్కార మార్గం దొరికందన్నారు. గ్రామాల్లో పరిశుభ్రతతో పాటు పచ్చదనం వెల్లివెరుస్తుందన్నారు. దేశానికి పట్టుకొమ్మలు పల్లెసీమలు. ఇప్పుడు ఈ పల్లెసీమలు పచ్చదనంతో దర్శనమిస్తున్నాయి. సీఎం కేసీఆర్ ఆలోచనకు అనుగుణంగా చేపట్టిన 30రోజుల ప్రణాళిక పల్లె ప్రగతికి దారిచూపింది. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలకు పరిష్కారం దొరికింది. ఉద్యమ స్ఫూర్తితో ఊరు బాగు కోసం జనం కదిలింది. ఇంటికొకరు చొప్పున మేము సైతం అంటూ శ్రమదానానికి నడుం బిగించారు. రోగాలను తరిమికొట్టేందుకు పారిశుద్ధ్యం, పరిశుభ్రత ఆవశ్యకతను గుర్తెరిగారు. తట్టాపారా చేతబట్టి చెత్తనెత్తేశారు. చీపురుతో రోడ్లు ఊడ్చారు. బూజు దులిపారు. మోరీలు సాపు చేశారు. మురికి కాలువలు బాగు చేశారు. దోమలకు నిలయంగా ఉన్న ఆవరణలు ఈ శ్రమదానంతో పచ్చదనానికి కేరాఫ్ అడ్రస్‌గా మార్చారని వివరించారు. ఊరు స్వరూపమే మారేలా 30రోజుల ప్రణాళికలో తమ చైతన్యాన్ని చాటారని అభినందించారు. ఈ 30 రోజులు నిరంతరం శ్రమించి ప్రతి ఒక్కరూ స్ఫూర్తి దాయకంగా నిలిచారు. ఇదే స్ఫూర్తి ఇక ముందు కొనసాగాలని పిలుపునిచ్చారు.

మన పల్లె.. మన ఇల్లు బాగుండాలనే తలంపు ప్రతి ఒక్కరిలో కలిగేలా ఈ కార్యక్రమం స్ఫూర్తిని రగిలించింది. మధురానుభూతిని మిగిల్చింది. కలెక్టర్ మొదలు వార్డు సభ్యుల వరకు అంతా ఏకమై ముందుకు కదిలారు. చెయ్యి చెయ్యి కలిపి ఊరు బాగు కోసం తమవంతు శ్రమదానం చేశారన్నారు. ఇదే స్ఫూర్తితో గ్రామాలను ఇంతకు రెండింతలు బాగు చేసుకోవాలని ఎర్రబెల్లి అన్నారు.

# సంక్షేమ పథకాలు భిక్ష కేసీఆర్‌దే

జనగామ,అక్టోబర్12(ఆర్ఎన్ఎ): దేశంలో ఎక్కడా లేనివిధంగా సీఎం కేసీఆర్ సంక్షేమ అభివృద్ధి పథకాలు అమలు చేస్తున్నారని స్టేషన్ ఘనాపూర్ ఎమ్మెల్యే రాజయ్య అన్నారు. రైతులకు ఎకరానికి పదివేల పెట్టుబడి, 24 గంటల నిరంతరం నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తోంది తెలంగాణ ప్రభుత్వం మాత్రమే నన్నారు. సీఎం కేసీఆర్‌ది ప్రజలందరికీ పారదర్శకంగా నిలిచే రామరాజ్య పాలన అని అన్నారు. రైతులు ఏవిధంగా మరణించినా రూ, 5 లక్షల బీమా అందిస్తోంది కేసీఆరే నన్నారు. రైతులకు రూ. లక్ష లోపు రుణాలను మాఫీ చేశామన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ఓవైపు సంక్షమ పథకాలను అమలు చేస్తూనే అభివృద్ధిలోనూ అగ్రగామిగా రాష్ట్రాన్ని నిలుపుతున్నారన్నారు. అన్ని వర్గాల వారికి చేయూత నందిస్తున్న సీఎం కేసీఆర్ తెలంగాణ ఆత్మగౌరవం పెంచారని అన్నారు. మిషన్ కాకతీయలో చెరువులను అభివృద్ధి పరచారన్నారు.

# తెలుగు రాష్ట్రాల్లో బిజెపి దూకుడు

హైదరాబాద్, అక్టోబర్ 12:ఇరు తెలుగు రాష్ట్రాల్లో బిజెపి దూకుడు పెంచింది. ఇరు తెలుగు రాష్ట్రాల్లో పాగా వేయాలన్న ఏకైక లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఎపిలో జగన్ తీసుకుంటున్న నిర్ణయాలపై బిజెపి ఘాటుగానే స్పందిస్తోంది. పోలవరం విషయంలో రివర్స్ టెండరింగ్‌ను పూర్తిగా వ్యతిరేకిస్తోంది. అలాగే మేఘా కంపెనీకి పోలవరం అప్పగించాలన్న నిర్ణయాన్ని కూడా పార్టీ రాష్ట్రశాఖ తప్పు పడుతోంది. అలాగే పోలవరంలో అవినీతి నిరూపించకుండా ముందుకు పోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకించింది. తాజాగా పార్టీ ప్రముఖులు పోలవరం సందర్శించి జగన్ సర్కార్‌పై తీవ్రంగానే విమర్శలు గుప్పించారు. ఎపిలో ప్రధానమైనది పోలవరం.ఈ ప్రాజెక్టుకు ఆర్థిక సహాయం అందించడంలో కేంద్రాన్ని పదేపదే కోరినా పెద్దగా ప్రయోజనం కానరావడం లేదు. పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించినందున ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన నిధులను కేంద్రం ఒక రోజు ఆలస్యంగానైనా ఇస్తుంది. పేచీ అంతా ఈ ప్రాజెక్టు కోసం సేకరించే భూమికి చెల్లించాల్సిన నష్టపరిహారంతోపాటు పునరావాస చర్యలకు అవసరమయ్యే 30 వేల కోట్లకుపైగా నిధుల గురించే! ఈ ఖర్చును ఎవరు భరించాలన్నదే ఇప్పుడు సమస్య. కేసీఆర్ అడుగుజాడల్లోనే జగన్ కూడా నిధులన్నింటినీ పంచి పెడుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. వాహనమిత్ర పేరిట దాదాపు రెండు వేల కోట్ల రూపాయలను పంచేశారు. డ్వాక్రా మహిళలకు యేటా 10 వేల కోట్ల రూపాయలు పంచాల్సి ఉంది. ఇవేకాకుండా వేల కోట్ల రూపాయల భారంపడే పథకాలు అమలుకు వేచివున్నాయి. ముఖ్యమంత్రి ఏ భరోసాతో ముందుకు వెళ్తున్నారో తెలియదని పలువురు వాపోతున్నారు. ఇలాంటి పథకాలతో రాష్ట్రాలను ఆర్థికంగా దెబ్బతీస్తున్నారన్న భావనలో బిజెపి పెద్దలు ఉన్నారు. ప్రాంతీయ పార్టీలు ఎన్నికల్లో అడ్డమైన హామీలతో అధికారంలోకి వచ్చాక నిధులు దుబారా చేయడాన్ని ప్రధాని మోదీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అందుకే తెలంగాణలోలాగా ఆంధప్రదేశ్‌లో కూడా జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై బీజేపీ రాష్ట్ర నాయకులు దాదాపుగా యుద్ధం ప్రకటించారు. బిజెపికి ఏ ప్రాంతీయ పార్టీ నమ్మదగిన స్థాయిలో లేదనడానికి ఇది తాజా ఉదాహరణ. దేశంలో ప్రాంతీయ పార్టీల వల్ల రాజకీయాలు కలుషితం అయ్యాయనీ, వారసత్వ రాజకీయాలు పెరిగిపోయాయనీ మోదీ,అమిత్ షా గట్టిగా నమ్ముతున్నారు. ఈ కారణంగానే కాంగ్రెస్‌ను దెబ్బతీసిన బీజేపీ నాయకత్వం ఇప్పుడు ప్రాంతీయపార్టీలపై దృష్టి కేంద్రీకరించింది. తెలంగాణలో కేసీఆర్ కుటుంబ పాలన నడుస్తోందని భావిస్తున్న బిజెపి, టీఆర్ఎస్‌ను తదుపరి టార్గెట్‌గా ఎంచుకుంది. నిజానికి తెలంగాణలో ప్రభుత్వం పట్ల క్షేత్ర స్థాయిలో ప్రజల్లో వ్యతిరేకత మొదలైంది. నిధుల కొరత కారణంగా నియోజకవర్గాల్లో కనీసం లక్ష రూపాయల బిల్లులను కూడా చెల్లించలకపోతున్నారు. ఫలితంగా తాము నియోజకవర్గాల్లో తిరగలేకపోతున్నామని టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వాపోతున్నారు. ప్రజల్లో వ్యతిరేకత కనిపిస్తోందని వారు అంగీకరిస్తున్నారు. తాజాగా ఆర్టీసీ సమ్మెతో ప్రజావ్యతిరేకత తీవ్రంగా కనిపిస్తోంది. ఈ సమ్మెతో కెసిఆర్ పట్ల గతంలో ఎన్నడూ లేనంతగా అసమనం ప్రజల్లో కనిపిస్తోంది. ఆర్టీసీ ఆస్తులు కాజేసే కుట్ర జరుగుతోందని ప్రజలు నమ్ముతున్నారు. దీంతో బిజెపి కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకుని తనకార్యాచరణ ముందుకు తీసుకుని వెళుతోంది. ఇకపోతే ఇటీవల ఒక్కరోజు తేడాలో ఇద్దరు సిఎంలు కెసిఆర్ ,జగన్‌లు ప్రధాని మోడీని కలిశారు. తమ రాష్ట్రాలను ఆదుకోవాలని కోరారు. అయినా కేంద్రం నుంచి పెద్దగా స్పందన రాలేదు. గతంలో రాష్ట్ర పర్యటనకు వచ్చి కేసీఆర్ ప్రభుత్వాన్ని ప్రశంసించి వెళ్లే కేంద్ర మంత్రులు ఇప్పుడు అలా చేయడం లేదు. కేసీఆర్ అవినీతికి పాల్పడుతున్నారని తీవ్ర విమర్శలు చేస్తున్నారు. అదే సమయంలో కేసీఆర్ విషయంలో బీజేపీ పెద్దలు స్పష్టమైన వైఖరితోనే ఉన్నారని తాజా పరిణమాలు తెలియచేస్తున్నాయి. కేసీఆర్‌ను రాజకీయంగా బిజెపి తన శత్రువుగానే భావిస్తున్నది. ఆయన నమ్మదగ్గ వ్యక్తి కాదని బిజెపి నేతలు బాహాటంగానే విమర్శలు చేస్తున్నారు. కారణాలు ఏమైనా గత ఎన్నికల నుంచి కేసీఆర్, బీజేపీ నాయకుల మధ్య సత్సంబంధాలు మాత్రం లేవనే చెప్పాలి. కేసీఆర్ ప్రభుత్వంపై బీజేపీ నాయకులు తీవ్రమైన ఆరోపణలు చేయడమే కాకుండా సీబీఐ విచారణ జరపాలని కోరుతున్నారు. రెండు పార్టీల మధ్య సంబంధాలు పూర్తిగా క్షీణించాయని చెప్పడానికి ఇంతకన్నా నిదర్శనం అవసరం లేదు. ఎపిలో కూడా ఇంచుమించు ఇలాగే విమర్శలు వస్తున్నాయి. ఒకవైపు నిధులు లేవంటూనే వివిధ పథకాల కింద డబ్బుల పందారం చేపెట్టడం ఏమిటన్నది బిజెపి నేతలు ఆగ్రహంగా ఉన్నారు. దీనికితోడు పాలనపై పట్టు లేదన్నట్లుగా కింది స్థాయిలో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో తాము ప్రజలకు సంజాయిషీ ఇచ్చుకోవలసి వస్తోందని ఎమ్మెల్యేలు మొత్తుకుంటున్నారు. గతంలో మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ పనులతో గ్రామాల్లో హడావుడి కనిపించేదనీ, ప్రజల వద్ద డబ్బులు ఉండేవనీ, ఇప్పుడు ఏ పనులూ జరగనందున ప్రభుత్వం పనిచేయడం లేదన్న భావన ఏర్పడుతోంది. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ లాంటి పథకాలకు డబ్బులు లేకుండా పోయాయి. మరోవైపు ఉద్యోగులు కూడా ప్రభుత్వానికి వ్యతిరేకంగా అంతర్గతంగా ప్రచారం చేస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులను ముందుపెట్టి తెలంగాణ ఉద్యమాన్ని నడిపించిన కేసీఆర్.. ఇప్పుడు అదే ఉద్యోగులను తోకలతో పోల్చడాన్ని కూడా ఉద్యోగులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఆర్టీసీ ఉద్యోగుల సమ్మె విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి కారణంగా ప్రజల్లో,ఉద్యోగుల్లో తీవ్ర వ్యతిరేకత వస్తోంది. సామాజిక మాధ్యమాల్లో దీనిపై విమర్శలు చెలరేగుతున్నాయి. గత ఎన్నికల్లో మాదిరిగా సంక్షేమ పథకాలే తనను ఆదుకుంటాయని కేసీఆర్ బలంగా నమ్ముతున్నట్టుగా ఉంది. ఈ నేపథ్యంలో హుజూర్‌నగర్ ఉప ఎన్నిక ఫలితం అనుకూలంగా వస్తే పర్వాలేదు గానీ.. పొరపాటున తేడా జరిగితే మాత్రం కేసీఆర్‌కు కష్టాలు తప్పకపోచ్చు. మొత్తంగా ఇప్పుడు రెండు రాష్ట్రాను బిజెపి టార్గెట్ చేసింది. అయితే ఏ మేరకు విజయం సాధిస్తుందన్నది కాలమే చెబుతుంది.

# పల్లెల్లో ఇకముందూ గ్రామ ప్రణాళికలు

## ప్రజలను నిరంతరాయంగా భాగస్వామ్యం చేసే యత్నాలు

హైదరాబాద్,అక్టోబర్12 (ఆర్ఎన్ఎ): గ్రామాల అభివృద్ధికి ముఖ్యమంత్రి కేసీఆర్ ఇప్పటికే ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. 30 రోజుల ప్రత్యేక కార్యాచరణలో మేము సైతం అంటూ స్థానికులు ముందుకొచ్చి అభివృద్ధి పనుల్లో భాగస్వాములయ్యారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో తమ గ్రామాలను తాము అభివృద్ధి చేసుకుంటామని, ప్రభుత్వం చేపట్టిన అన్ని కార్యక్రమాలను అమలయ్యేలా చూస్తామని ఆయా గ్రామాల ప్రజలు అధికారులకు హామీ ఇచ్చి శ్రమదానంతో పలు పనులను చేపట్టారు. ఇవన్నీ కూడా మొన్నటి కలెక్టర్ల సమావేశంలో సమీక్షించారు. దీంతో ఇప్పుడు జిల్లాల్లో ఇలాగే ప్రజల భాగస్వామ్యంతో ముందుకు సాగాలని చూస్తున్నారు. ప్రత్యేకాధికారులు, ఉన్నతాధికారులు రోజు వారి కార్యక్రమాలను పర్యవేక్షించగా గ్రామాల అభివృద్ధికి ఏర్పాటు చేసిన వివిధ కమిటీలు ఈ కార్యక్రమంలో తమకు అప్పజెప్పిన బాధ్యతలను నిర్వర్తించారు. దీంతో పంచాయతీల్లో 30 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక విజయవంతంగా ముగిసింది. జిల్లాలో ఈ కార్యక్రమం ఉద్యమంలా కొనసాగగా ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానికుల సహకారంతో గ్రామాలు కొత్త అందాలను సంతరించుకున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానికులతో కలిసి గ్రామాల్లో పిచ్చి మొక్కలను, తుమ్మలను తొలగించడం, మురికి కాలువలను శుభ్రం చేసి, బ్లీచింగ్ పౌడర్ చల్లడం, పెంట కుప్పలను తొలగించడం, శిథిలావస్థలో ఉన్న ఇండ్లను కూల్చివేయడం, నీటి ట్యాంకులను శుభ్రం చేయడం, గ్రామస్తులతో కలిసి ర్యాలీలు నిర్వహిస్తూ ఈ కార్యక్రమ ఉద్దేశాలను తెలియజేశారు. వీటితో పాటు గ్రామాల్లో మరుగుదొడ్ల వినియోగం, మొక్కల పెంపకంతో కలిగే ప్రయోజనాలను అధికారులు ప్రజలకు వివరించారు. పవర్ వీక్ కార్యక్రమంలో భాగంగా ఎన్నో ఏండ్లుగా పేరుకుపోయిన విద్యుత్ సమస్యలను అధికారులు పరిష్కరించారు. అలాగే ప్రజల్లో పచ్చదనం, పరిశుభ్రత పై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడంలో అధికారులు కృషి చేశారు. దీంతో గ్రామాల ప్రజలు తమ ఇండ్లతోపాటు వీధులను పరిశుభ్రంగా ఉంచేలా తమ వంతు సహకారాన్ని అందించారు. చెత్తాచెదారాన్ని వీధుల్లో, మురికి కాలువల్లో పడేయకుండా చెత్తబుట్టల్లో వేసి పంచాయతీ రిక్షాలు, డంపింగ్ యార్డులకు తరలిస్తున్నారు. మురికికాలువలు శుభ్రంగా ఉండేలా చూస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, స్థానికులు దాతల రూపంలో విరాళాలు అందజేశారు. నగదుతో పాటు భూమి, చెత్తబుట్టలు, ట్రీగార్డులు ఇతర వస్తువులను ఇచ్చారు. దాదాపు అన్ని జిల్లాల్లో ఈ కార్యక్రమం ఉద్యమంలా కొనసాగగా ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానికుల సహకారంతో గ్రామాలు కొత్తశోభను సంతరించుకున్నాయి. ఇదే స్ఫూర్తి కొనసాగించాలని కలెక్టర్లకు సిఎం కెసిఆర్ దిశానిర్దేశం చేయడంతో ఇకముందు కూడా పల్లెల్లో నిరంతరాయంగా ఈ కార్యక్రమాలు కొనసాగించేలా కలెక్టర్లు ప్రణాళికలు సిద్దం చేస్తేనే స్ఫూర్తి కొనసాగుతుంది.

# హుజూర్‌నగర్‌లో వేడెక్కిన ప్రచారం

## దూసుకుపోతున్న టిఆర్ఎస్ శ్రేణులు

## గెలుపు లక్ష్యంగా నేతల దూకుడు

నల్లగొండ,అక్టోబర్12(ఆర్ఎన్ఎ): హుజూర్‌నగర్ ఉపఎన్నికను అధికార టిఆర్ఎస్ ప్రతిష్టాత్మకంగీ తీసుకుని ప్రచారం ముమ్మరం చేస్తోంది. నేతలంతా ఇక్కడే మకాం వేసి ప్రచారం సాగిస్తున్నారు. ఏ గ్రామాన్ని వదలకుండా మంత్రలుఉ, ఎమ్మెల్యేలు, ఎంపిలు కూడా ప్రచారంలో దూసుకుని పోతున్నారు. ఈ నెల 19న సాయంత్రంతో ప్రచారం ముగియనుండగా అన్ని పార్టీలు తమ ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. టీఆర్ఎస్‌కు సీపీఐ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్దతు ప్రకటించగా.. సీపీఎం నామినేషన్ తిరస్కరించడంతో తెలంగాణ ప్రజా పార్టీకి మద్దతు ప్రకటించింది. ఈ ఎన్నికతో ఉత్తమ్ కంచుకోటను దెబ్బతీయాన్న కసి కనిపిస్తోంది. నల్లగొండ ఎంపీగా గెలిచిన ఉత్తమ్ కుమార్‌రెడ్డి రాజీనామాతో ప్రస్తుత ఉప ఎన్నిక జరుగుతుండగా.. పీసీసీ చీఫ్ ఉత్తమ్ చేతిలో స్వల్ప తేడాతో ఓటమి పాలైన శానంపూడి సైదిరెడ్డిని మరోసారి టీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో దించింది. ఉత్తమ్ కుమారెడ్డి భార్య నల్లమాద పద్మావతి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తుండగా.. బీజేపీ నుంచి డాక్టర్ కోటా రామారావు, టీడీపీ అభ్యర్థిగా చావా కిరణ్మయి పోటీలో ఉన్నారు. 28మంది పోటీ పడుతున్న ఈ స్థానం కోసం ఈ నెల 21న పోలింగ్ జరగనుంది. 24న ఓట్ల లెక్కింపుతో ఫలితం వెలువడనుంది. దీనికితోడు కేసీఆర్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు తమనుగెలిపిస్తాయని టిఆర్ఎస్ బలంగా నమ్ముతోంది. గత ఎన్నికల్లో ఓటమి పాలైన టీఆర్ఎస్ అభ్యర్థి సైదిరెడ్డి.. ప్రస్తుత ఉప ఎన్నికల్లో ప్రచారంలో ఉత్సాహంగా దూసుకు పోతున్నారు. నోటిఫికేషన్ విడుదలైన రోజే అభ్యర్థిగా సైదిరెడ్డి పేరు ఖరారు కావడంతోపాటు ఆయనకు మద్దతుగా టిఆర్ఎస్నేతలు ప్రచారంలోకి దూకారు. గత ఎన్నికల్లోనే స్వల్ప తేడాతో ఓడిపోయిన ఈ స్థానాన్ని ఈసారి ఎలాగైనా భారీ మెజార్టీతో కైవసం చేసుకోవాలనే ఆలోచనతో ఉన్న టీఆర్ఎస్.. అందుకు తగ్గట్టుగానే మొదటి నుంచీ వ్యూహాత్మకంగా ముందుకు వెళ్తోంది. ఉప ఎన్నిక ఇన్‌చార్జీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జిల్లా మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి తమదైన వ్యూహాలతో ప్రచారం చేపడుతున్నారు. టీఆర్ఎస్ నాయకులు ఆయా మండలాల్లో విస్తృత ప్రచారం సాగిస్తున్నారు. హుజూర్‌నగర్, నేరేడుచర్ల మున్సిపాలిటీలతోపాటు అన్ని మండలాల్లో టీఆర్ఎస్ ప్రచారం చేస్తోంది. హుజూర్‌నగర్‌లో నిర్వహించిన మంత్రి కేటీఆర్ రోడ్ షో సందర్భంగా పెద్ద సంఖ్యలో కాంగ్రెస్‌తోపాటు ఇతర పార్టీల నుంచి పలువురు టీఆర్ఎస్‌లో చేరారు. ఈ నెల 19తో ప్రచార గడువు ముగియనుండగా.. అంతకు ముందే టీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని టీఆర్ఎస్ శ్రేణులు చెప్తున్నాయి. అధినేత ప్రచారంతో తమ మెజార్టీ మరింత పెరుగుతుందని ఉత్సాహంతో ఉన్నాయి. మరోవైపు కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతితోపాటు టీడీపీ, బీజేపీ, స్వతంత్ర అభ్యర్థులూ ముమ్మరంగా ప్రచారం సాగిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలంతా ప్రచారంలో పాల్గొంటారని ఇప్పటి వరకు కొద్ది మంది మాత్రమే అక్కడక్కడా ప్రచారం చేపట్టారు.

# మరో యాదాద్రిగా ధర్మపురి

## మంత్రి కొప్పుల హామీతో స్థానికుల్లో ఆనందం

జగిత్యాల,అక్టోబర్12(ఆర్ఎన్ఎ): ధర్మపురి క్షేత్రాన్ని మరో యాదాద్రిగా మార్చేందుకు సీఎం కేసీఆర్ కృతనిశ్చయంతో ఉన్నారని మంత్రి కొప్పుల ఈశ్వర్ చేసిన ప్రకటన ఇక్కడ ఇప్రజల్లో ఆశలు కలిగిస్తోంది. ధర్మపురలి క్షేత్రాన్ని అభివృద్ధి చేసేందుకు ఎప్పటి నుంచేప్రజలు కోరుతున్నారు. ధర్మపురి క్షేత్రం అభివృద్ధికి మొదటి విడతలో రూ. 100కోట్లు కేటాయించినట్లు మంత్రి పేర్కొన్నారు. మేజర్ పంచాయతీగా ఉన్న ధర్మపురిని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయించి అభివృద్ధికి రూ. 25కోట్లు మంజూరు చేయించినట్లు చెప్పారు. అలాగే ధర్మపురి పట్టణంలో రూ. 8.50కోట్ల నిధులతో 50 పడకల మాతాశిశు ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణం చేపట్టనున్నట్లు వివరించారు. రూ. 50లక్షల ఎస్సీడీ నిధులతో అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు గుర్తు చేశారు. ఎస్సీ కమ్యూనిటీ హాల్‌కు ఇదివరకు ఇచ్చిన రూ. 50లక్షల నిధులు కాకుండా మరో రూ. 50లక్షలు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ధర్మపురి నుంచి బీర్‌పూర్, ధర్మపురి నుంచి దొంతాపూర్ వరకు రోడ్లు విస్తరించినట్లు పేర్కొన్నారు. అలాగే ధర్మపురిలో రూ. 1.50కోట్లతో శ్మశాన వాటిక నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. వర్షాలతో పనులు ప్రారంభించ లేదనీ, త్వరలోనే ప్రారంభించి పూర్తి చేయించనున్నట్లు పేర్కొన్నారు. గోదావరిలో మురుగునీరు కలువకుండా మురుగునీటిని మళ్లిస్తూ రూ. 3.80కోట్లతో నిర్మిస్తున్న మహా మురుగుకాలువ నిర్మాణ పనులు కూడా కొనసాగుతున్నాయి. త్వరతగిన పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. మొత్తంగా ఈ నిధులు విడుదలయితే ధర్మపురి రూపురేఖలు మారుతాయని స్థానికులు అన్నారు.

# ధాన్యం సేకరణపై రైతులకు అవగాహన

జగిత్యాల,అక్టోబర్12(ఆర్ఎన్ఎ): ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లను సమన్వయంతో చేపట్టాలని జిల్లా అధికారులు కోరారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని మార్కెట్‌కు తెచ్చే విధంగా వ్యవసాయ అధికారులు ముందుగా ధాన్యాన్ని పరిశీలించి అవగాహన పర్చాలన్నారు. నాణ్యమైన ధాన్యం తెస్తే మద్దతు ధర ఉంటుందని తెలియజెప్పాలని, కరపత్రాల ద్వారా విస్తృత ప్రచారం చేయాలన్నారు. అలాగే రైతు ధాన్యం అమ్మిన రోజే ఆన్‌లైన్ చేస్తే రైతు బ్యాంకు ఖాతాలో 48 గంటల్లోగా నగదు జమ అవుతుందని, వారంలో ధాన్యం కొనుగోళ్లకు రానుందన్నారు. ప్రతీ కొనుగోలుకు కేంద్రం వద్ద రైతులకు ఇబ్బందులు కలగకుండా వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని టార్పాల్స్ ఏర్పాటు చేయాలని, అదే విధంగా రైతు ధాన్యాన్ని నిలువచేసే గన్నీ బ్యాగులు సిద్దంగా ఉంచుకోవాలన్నారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో ఎంత ధాన్యం దిగుబడి రానుందని అంచనా వేస్తూ అందుకు గాను కొనుగోళ్లు జరిపేందుకు వివిధ శాఖల ద్వారా కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నామన్నారు. రైతు మార్కెట్‌కు ధాన్యం తెచ్చేటప్పుడు తేమ శాతాన్ని పరిశీలించి టోకెన్ ఇవ్వాలని, టోకెన్‌ల ప్రకారమే కొనుగోళు జరపాలన్నారు. రైతులు ధాన్యం తెచ్చి మార్కెట్లలో ఆరబెట్టరాదన్నారు. రైతులు ఇబ్బంది పడకూడదని, ఎన్నికల ప్రచారం దృష్టిలో ఉంచుకొని ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా సమన్వార్తితో వ్యవహరించాలన్నారు.

# దళారులను నమ్మి మోసపోవద్దు

మెదక్,అక్టోబర్12(ఆర్ఎన్ఎ): జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలే లక్ష్యంగా చేసుకున్నామని వ్యవసాయ అధికారులు అన్నారు. ధాన్యం కొనుగోళ్లలో దళారుల పాత్ర ఉండదన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయాలు జరుపాలన్నారు. జిల్లాలోని మెదక్ మార్కెట్ కమిటీ యార్డులో, నర్సాపూర్ మార్కెట్ కమిటీ యార్డులో, రామాయంపేట మార్కెట్ కమిటీ యార్డు, చేగుంట మార్కెట్ కమిటీ, వెల్దుర్తి, పెద్దశంకరంపేట మండల కేంద్రాల్లో మార్కెఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం పాటుపడుతున్నదని అన్నదాతలకు ఇబ్బందులు కలిగించకూడదనే ఉద్దేశంతోనే మొక్కజొన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు స్పష్టం చేశారు. జ.ుల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు చేగుంట, మెదక్, నర్సాపూర్, రామాయంపేటలలోధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం జరిగిందన్నారు. ఇంకా అవసరం ఉన్న చోట కూడా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామన్నారు.

# ఉగ్రవాద సంస్థలకు సహకారాన్ని నిలిపివేయాలి

## - పాక్‌కు అమెరికన్ సెనెటర్ల హెచ్చరిక..!

న్యూఢిల్లీ, అక్టోబర్12(ఆర్ఎన్ఎ) : తాలిబన్ సహా ఇతర ఉగ్రసంస్థలకు సహకారం అందించడం నిలిపివేయాలని అమెరికన్ సీనియర్ సెనెటర్ మ్యాగీ హసన్ పాకిస్థాన్‌ను హెచ్చరించారు. దీనిపై ఆ దేశ నాయకులు ప్రముఖంగా దృష్టి సారించాల్సిన అవసరం ఉందని గుర్తుచేశారు. మరో సెనెటర్ క్రిస్ వాన్ హోలెన్‌తో కలిసి హసన్ పాకిస్థాన్‌లో పర్యటించారు. ఆ దేశ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌తో పాటు ఆర్మీ చీఫ్ ఖమర్ జావెద్ బజ్వాతో భేటీ అయ్యారు.

ఉగ్రవాదాన్ని అడ్డుకొని ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వృద్ధికి తోడ్పడాలని ఈ సందర్భంగా అక్కడి నాయకులకు సూచించారు. ఉగ్రవాద భావజాలం వ్యాప్తి చెందకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కశ్మీర్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ.. వివాదాల పరిష్కారానికి పూర్తి సహకారం అందిస్తామని పేర్కొన్నారు. అంతకుముందు ఇరువురు సెనెటర్లు పాక్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే)లో పర్యటించారు. అధికరణ 370 రద్దు తర్వాత భారత్-పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో అక్కడి పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. ప్రాంతీయంగా శాంతి, భద్రతల్ని నెలకొల్పే దిశగా ఇరు దేశాలు సంయమనం పాటించాలని కోరారు. శుక్రవారంతో పాక్‌లో పర్యటన ముగించుకున్న ఈ బృందం శనివారం భారత్ చేరుకున్నారు. ఇక్కడ పలువురు నాయకులు, అధికారులతో భేటీ కానున్నారు. కశ్మీర్ పరిస్థితులు సహా భారత్-అమెరికా సంబంధాలపై చర్చించనున్నారు.

# మద్యం మత్తులో పిల్లలకు విషమిచ్చిన తండ్రి

## ఒకరు మృతి...తండ్రీ కొడుకుల పరిస్థితి విషమం

మేడ్చల్,అక్టోబర్12(ఆర్ఎన్ఎ): జిల్లాలోని పోలీస్‌రాజా బొల్లారం తండాలో విషాదం చోటు చేసుకుంది. మద్యం మత్తులో ఓ తండ్రి కూల్‌డ్రింక్‌లో మందు గుళికలు కలిపి తన ఇద్దరు కుమారులకు తాగించి, తను కూడా తాగాడు. స్థానికుల వివరాల ప్రకారం.. సురేష్ అనే వ్యక్తి మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలోనే పూటుగా మద్యం సేవించిన అతను కూల్‌డ్రింక్‌లో ప్రాణాంతక మందు గుళికలు కలిపి తన కుమారులకు.. ప్రణయ్(7), ప్రణీత్(5) లకు తాగించి, తను కూడా తాగాడు. విషయం తెలుసుకున్న స్థానికులను వారిని హాస్పిటల్‌కి తరలించగా.. ప్రణీత్ అప్పటికే మరణించాడు. ప్రణయ్, తండ్రి సురేష్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారి పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు డాక్టర్లు తెలిపారు.

# ముంబైలో ఇక పద్మిని ట్యాక్సీలు కనుమరుగు

## ఉత్పత్తి నిలిచి పోవడంతో క్యాబ్‌లు వెనక్కి

ముంబై,అక్టోబర్12(ఆర్ఎన్ఎ): ఐదు దశాబ్దాల పాటు ముంబై నగరవాసులకు సేవలందించిన ప్రీమియర్ పద్మిని ట్యాక్సీలు వచ్చే ఏడాది జూన్ నుంచి కనుమరుగు కానున్నాయి. కాలీ పీలీ అని ముంబై వాసులు ముద్దుగా పిలుచుకునే ఈ ట్యాక్సీలు పాత ముంబై నగర సంస్కృతికి దరణంగా నిలిచాయి. ప్రీమియర్ పద్మినీ కార్ల ఉత్పత్తి 2000 సంవత్సరంలో నిలిచిపోగా కొత్త క్యాబ్ సర్వీసులు, ఇతర రవాణా ప్రత్యామ్నాలు అందుబాటులోకి రావడంతో ప్రస్తుతం ముంబై రోడ్లపై కేవలం 50 కన్నా తక్కువ పద్మినీ ట్యాక్సీలే తిరుగుతున్నాయి. త్వరలోనే ఈ కాలీ పీలీ ట్యాక్సీలు చరిత్రలో కలసిపోనుండడం ఒకప్పటి బొంబాయిని ప్రేమించే వారికి విషాదాన్ని మిగల్చనున్నది. 1994లో ఫియట్ 1100 పేరిట రూపొందిన ఈ ఇండో– ఇటాలియన్ మోడల్ కారు మూడు దశాబ్దాల పాటు భారతదేశంలో అత్యంత జనాదరణ పొందింది. 1965లో ప్రేమియర్ ప్రెసిడెంట్‌గా పేరు మార్చుకున్న ఫియట్ 1100 తిరిగి మహారాణి పద్మిని పేరిట ప్రీమియర్ పద్మినిగా 1974లో మరోసారి మారింది. 1990దశకం చివరిలో ఈ కార్ల ఉత్పత్తి నిలిచిపోగా ప్రస్తుతం దీనికి సంబంధించిన విడి భాగాలు, టైర్లు, మరమ్మతులకు చెందిన పరికరాలు అందుబాటులో లేవు. అంతేగాక ఆర్‌టిఓ నిబంధనల ప్రకారం ట్యాక్సీలను 20 ఏళ్లకు మించి నడపకూడదు. ఈ కారణంగానే వచ్చే ఏడాది జూన్ నుంచి పద్మిని ట్యాక్సీలు పూర్తిగా కనుమరుగు కానున్నాయని ముంబై ట్యాక్సీడ్రైవర్ల సంఘం నాయకుడు ఎంఎల్ ఖుద్రోస్ చెప్పారు. 2005లో ముంబైలో వరదలు వచ్చినపుడు మిగతా క్యాబ్‌లు రోడ్లపైకి రానప్పటికీ పద్మిని ట్యాక్సీలు మాత్రం 24 గంటల్లోనే రోడ్లపైన పరుగెత్తిన విషయాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు. ఇప్పటికీ కొందరు పాత కస్టమర్లు పద్మిని ట్యాక్సీలలోనే ముంబై రోడ్లపై ప్రయాణిస్తూ తమ మధురానుభూతులను గుర్తు చేసుకుంటుంటారని ఆయన చెప్పుకొచ్చారు.

# బస్ భవన్ ముట్టడికి కార్మికుల యత్నం

- • అడ్డుకున్న పోలీసులు, ఉద్రిక్తత
- • రోడ్డుపై బైఠాయించిన బీజేపీ అధ్యక్షుడు లక్ష్మణ్
- • మద్దతుగా పాల్గొన్న జనసమితి, సీపీఐ, ప్రజా సంఘాలు
- • ప్రభుత్వం స్పందించకపోతే ప్రగతి భవన్‌ను ముట్టడించి తీరుతాం
- • ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని
- • ప్రభుత్వాన్ని హెచ్చరించిన బీజేపీ అధ్యక్షుడు లక్ష్మణ్

## – కేసీఆర్ తీరుపై భగ్గుమన్న కార్మిక సంఘాల నాయకులు

హైదరాబాద్, అక్టోబర్12(ఆర్ఎన్ఎ) : ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని బస్సు భవన్ ముట్టడికి యత్నించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్, ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డితో పాటు తెలంగాణ జనసమితి, సీపీఐ, ప్రజా సంఘాలు, ఆర్టీసీ కార్మికులు భారీ సంఖ్యలో ముట్టడికి తరలివచ్చారు. దీంతో అప్పటికే అప్రమత్తమైన పోలీసులు వారిని అడ్డుకొనే ప్రయత్నం చేశారు. లక్ష్మణ్, అశ్వత్థామరెడ్డి, సహా మిగిలిన నేతలకు పోలీసులు నచ్చజెప్పినా వారు వినిపించుకోకుండా భవన్ ముట్టడికి యత్నించారు. దీంతో పోలీసులు ఒక్కసారిగా వారిని వెనక్కినెట్టి అడ్డుకున్నారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన నేతలు ఆర్టీసీ భవన్ ముందు రోడ్డుపైనే బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికులు చేపడుతున్న సమ్మెకు బీజేపీ మద్దతిస్తోందని, ప్రత్యక్ష రంగంలోకి దిగినట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించకపోతే.. ప్రగతి భవన్ ముట్టిస్తామని, ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. తెలంగాణ సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలంటున్నారు. గతంలో ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

### ప్రభుత్వం దారుణంగా వ్యవహరిస్తుంది – పీఓడబ్ల్యూ అధ్యక్షురాలు సంధ్య

ఆర్టీసీ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల కోసం మాట్లాడితే వాళ్లను బట్టలు చించేలా కొట్టారని ప్రగతిశీల మహిళా సంఘం(పీఓడబ్ల్యూ) రాష్ట్ర అధ్యక్షురాలు సంధ్య ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని ఇచ్చిన హామీని సీఎం కేసీఆర్ గాలికి వదిలేశారని ధ్వజమెత్తారు. విలీనం చేయకపోగా ఉద్యోగాలు భర్తీ చేయడం లేదని, ఆర్టీసీ సిబ్బందికి జీతాలు ఇవ్వడం లేదన్నారు. దీంతో విసిగిపోయిన కార్మికులు సమ్మె చేపట్టారని, వీరికి ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. చర్చల కమిటీని మొదటి రోజే ఎలా రద్దు చేస్తారని ప్రశ్నించారు. చర్చలు జరపాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా అని ప్రశ్నించారు. ఉద్యోగాలు తీసేస్తామంటూ ప్రభుత్వం దారుణంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. తెలంగాణ ప్రజా రవాణా వ్యవస్థను దెబ్బదీసి ప్రైవేటీకరణ చేసేందుకు ప్రభుత్వం తెగించి కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కారమయ్యేంత వరకు అన్ని వర్గాలు ముందుకు రావాలని సంధ్య పిలుపునిచ్చారు. మరోవైపు తెలంగాణ జనసమితి నేతలు మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికులకు చివరి వరకు అండగా ఉంటామని స్పష్టం చేశారు. సకల జనుల సమ్మెలో జీవితాలను సైతం లెక్కచేయకుండా పాల్గొని ఆర్టీసీ కార్మికులు ఆదర్శంగా నిలిచారని గుర్తుచేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మరోవైపు డిపోల ఎదుట కార్మికులు మౌన దీక్ష చేపట్టారు. ఆర్టీసీ ఉద్యోగులు బర్తరఫ్ అయినట్లుగా ప్రకటించి..వారి స్థానంలో కొత్త వారిని నియమించడం అప్రజాస్వామికమని కార్మికులు వెల్లడించారు. ప్రభుత్వ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగులకు ఒక్క మాటతో 50 వేల మందిని డిస్మిస్ చేశామని అన్నారు. తామే ప్రభుత్వాన్ని డిస్మిస్ చేస్తున్నామన్నారు. రూ. 50 వేల జీతాలు అంటున్నారని, రూ. 20వేల జీతం ఉన్నట్లు చూపిస్తారా? అంటూ సవాల్ విసిరారు. దీనికి సంబంధించిన ప్లే స్లిప్పులను మీడియాకు చూపించారు. సకల జనుల సమ్మెలో ఆర్టీసీ కార్మికులు కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. పక్క రాష్ట్రంలో ప్రభుత్వం చేసినట్లు..ఇక్కడ కూడా చేయాలన్నారు.

# కాంగ్రెస్ నేత సింధియాను స్వాగతిస్తూ పోస్టర్లు

## –బిజెపి నేత పోస్టర్‌తో మధ్యప్రదేశ్‌లో చర్చ

భోపాల్,అక్టోబర్12(ఆర్ఎన్ఎ): ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జ్యోతిరాదిత్య సింధియాకు స్వాగతం చెబుతూ వెలిసిన ఓ బీజేపీ ఫ్లెక్సీ మధ్యప్రదేశ్ రాజకీయాల్లో ఊహాగానాలకు తెరలేపింది. సింధియా బింధ్ పర్యటన సందర్భంగా ఓ బీజేపీ నేత ఈ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. సింధియాతో పాటు ఈ పోస్టర్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బీజేపీ సారథి, కేంద్రమంత్రి అమిత్ షా కూడా ఉన్నారు. ఆర్టికల్ 370ని రద్దు చేస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని సమర్థించిన నేపథ్యంలో స్థానిక బీజేపీ నేత హృద్యేశ్ శర్మ ఈ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ఇటీవల సింధియా కాంగ్రెస్ తీరును విమర్శిస్తూ వార్తల్లోకి వచ్చారు. ఆయన బిజెపిలోకి వస్తారన్న ఊహాగానాలు కూడా ఉన్నాయి. దేశ ప్రయోజనాల కోసం తీసుకున్న ఈ నిర్ణయానికి తాను మద్దతు ఇస్తున్నానంటూ ఆర్టికల్ 370 రద్దు తర్వాత సింధియా ట్వీట్ చేసిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్ అధిష్టానం విధానానికి వ్యతిరేకంగా ఆయన మాట్లాడడం ఆ పార్టీలో? తీవ్ర చర్చనీయాంశం అయ్యింది. కాగా బింధ్ పర్యటన సందర్భంగా కాంగ్రెస్ పైనా సింధియా విమర్శలు గుప్పించారు. తాము రూ.2 లక్షల వరకు రైతు రుణాలు మాఫీ చేస్తామని హామీ ఇచ్చామనీ.. కానీ ప్రభుత్వం రూ.50 వరకే రుణమాఫీ చేసిందని విమర్శించారు. దీంతో ముందు ముందు ఆయన రాజకీయ నిర్ణయాలు ఎలా ఉండబోతున్నాయో అంటూ చర్చ మొదలయ్యింది.

# పోలీసులకు సవాల్‌గా మారిన సీరియల్ హత్యలు

## –కేరళ పోలీస్ చీఫ్ లోక్‌నాథ్ బెహ్రా

కోజికోడ్,అక్టోబర్12(ఆర్ఎన్ఎ): సైనైడ్ సీరియల్ కిల్లర్ జాలీ జోసెఫ్ కేసు అత్యంత సవాలుతో కూడుకున్నదని కేరళ పోలీస్ చీఫ్ లోక్‌నాథ్ బెహ్రా పేర్కొన్నారు. ఈ కేసులో మొదటి హత్యకు, చివరి హత్యకు 14 ఏళ్ల వ్యవధి ఉన్నందున ఆధారాల సేకరణ క్లిష్టంగా ఉంటుందన్నారు. ఈ కేసుకు ఉన్న ప్రాధాన్యత దృష్ట్యా జాలీని తాను కూడా ప్రశ్నించే అవకాశాలు లేకపోలేదని బెహ్రా అన్నారు. ఒకే కుటుంబంలో జరిగిన ఈ సీరియల్ హత్యలపై దర్యాప్తు చేస్తున్న పోలీసు బృందంతో సుదీర్ఘ సమావేశాలు జరిపిన బెహ్రా... మీడియాతో మాట్లాడారు. ఇది అత్యంత సవాలుతో కూడుకున్న కేసు. ఇది చాలా ముఖ్యమైన కేసు అయినందున నేను ఇక్కడికి వచ్చానని తెలిపారు. ఆరు హత్యలు జరిగాయి కాబట్టి.. మొత్తం ఆరు కేసులు విడివిడిగా విచారించాల్సి ఉంటుందన్నారు. అసలు సవాల్ ఏమిటంటే.. తొలి హత్య 17 క్రితం చోటుచేసుకోగా, చివరి హత్య మూడేళ్ల క్రితం జరిగింది. కాబట్టి ఆధారాలు సేకరించడం అత్యంత క్లిష్టంగా ఉంటుందని పేర్కొన్నారు. మిస్టరీగా మారిన ఈ హత్యలన్నీ రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి టామ్ థామస్ కుటుంబంలో జరిగాయి. మొత్తం ఆరు మృతదేహాలను మళ్లీ వెలికి తీసిన పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం సాయంతో పక్కాగా ఆధారాలు సేకరించేందుకు ప్రయత్నిస్తున్నారు.

# చలకుర్తి మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తి మృతి

నల్లగొండ,అక్టోబర్12(ఆర్ఎన్ఎ): చలకుర్తి మాజీ ఎమ్మెల్యే, టీఆర్ఎస్ నాయకులు గుండెబోయిన రామ్మూర్తి యాదవ్ కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శుక్రవారం రాత్రి 11:30 గంటలకు తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. 1994-99 మధ్య చలకుర్తి ఎమ్మెల్యేగా

రామ్మూర్తి యాదవ్ పని చేశారు. రామ్మూర్తి మృతిపట్ల టీఆర్ఎస్ నాయకులు సంతాపం తెలిపారు. మాజీ ఎమ్మెల్యే అంత్యక్రియలు త్రిపురారం మండలం పెద్ద దేవులపల్లి గ్రామంలో ఆదివారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

# భార్యపై అనుమానంతో పగ

## గొడ్డలితో నరికి చంపి పరారైన భర్త

హైదరాబాద్,అక్టోబర్12 (ఆర్ఎన్ఎ): అనుమానం పెనుభూతమై... భార్యను అతి దారుణంగా చంపాడో భర్త. గొడ్డలితో నరికి కిరాతకంగా హత్య చేశాడు. ఈ సంఘటన అంబర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ మోహన్ కుమార్ కథనం ప్రకారం... కర్నూలు జిల్లాకు చెందిన అబ్దుల్ రషీద్ (31), నౌషద్ బేగం (23)కు 2013లో వివాహమైంది. వీరికి బాబు (4), పాప(3) సంతానం. అబ్దుల్ రషీద్ ఎస్‌పీఎఫ్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ ... గత ఏడాది కాలంగా అంబర్‌పేట ఆజాద్‌నగర్‌లో నివాసముంటున్నారు. కాగా.. కొంత కాలంగా భార్యపై అనుమానం పెంచుకున్నాడు. భార్య మరొకరితో సంబంధం పెట్టుకుందన్న అనుమానంతో వారి మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈ విషయంపై శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో అబ్దుల్ రషీద్ భార్యతో గొడవకు దిగాడు. మాటా మాట పెరగడంతో తీవ్ర ఆవేశానికి గురైన రషీద్ గొడ్డలితో భార్యపై విచక్షణారహితంగా నరికాడు. తీవ్ర గాయాల పాలైన బాధితురాలు అక్కడికక్కడే మృతి చెందింది. నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. ఇంటి యజమాని సలీమ్ ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కాగా.. తల్లి మృతి చెందగా, తండ్రి పరారీ అవ్వడంతో ఇద్దరు పిల్లలు అనాథలుగా మారారు.

# గంగా కాలుష్య నివారణకు కృషి చేస్తా: పవన్ కళ్యాణ్

హరిద్వార్,అక్టోబర్12(ఆర్ఎన్ఎ): హరిద్వార్ పర్యటనలో ఉన్న జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ శనివారం ఉదయం పవిత్ర గంగా హారతిలో పాల్గని హారతిని ఆద్యంతం తిలకించారు. అనంతరం పవన్ కళ్యాణ్ మీడియాతో మాట్లాడుతూ.. గంగా ప్రక్షాళన కార్యక్రమానికి తన వంతు కృషి చేస్తానన్నారు. అందుకు అనుగుణంగా ప్రజల నమ్మకాలు, విశ్వాసాలను దృష్టిలో పెట్టుకొని నడుచుకుంటానన్నారు. గంగ ను కాలుష్యానికి గురికాకుండా ఘన సంస్కృతిని పరిరక్షించేందుకు తీసుకోవాల్సిన అంశాలపై స్థానికులతో చర్చించారు. గంగానది ప్రక్షాళన కోసం దక్షిణాది రాష్ట్రాల నుండి పెద్దగా మద్దతు రావడం లేదని ఆ లోటును భర్తీ చేయాలని మాత్రిసదన్ ఆశ్రమ ప్రతినిధులు పవన్ కళ్యాణ్‌ను కోరారు.

# ప్రచారంలో విద్వేష ప్రసంగాలు చేయరాదు

## సభలు, సమావేశాలకు అనుమతులు తప్పనిసరి

నల్లగొండ,అక్టోబర్12(ఆర్ఎన్ఎ): హుజూర్ నగర్ ఉప ఎన్నికలను స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎన్నికల విధులు నిర్వహిస్తున్న అధికారులు పేర్కొన్నారు. ఎన్నికల్లో పాల్గొనే అభ్యర్థులు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను అందరు పాటించాలన్నారు. ప్రతి రాజకీయ నాయకుడు కుల, మతాల పరంగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయరాదన్నారు. విమర్శలనేవి పథకాలపై మాత్రమే ఉండాలని, వ్యక్తిగత దూషణలు, ఆరోపణలు చేయరాదన్నారు. సభలు, సమావేశాలు, ర్యాలీలు తీయడానికి ప్రత్యేకంగా పోలీసులచే అనుమతి తీసుకోవాలన్నారు. ర్యాలీలు ఒకే రహదారి గుండా కావాలని ఇద్దరు, ముగ్గురు దరఖాస్తు చేసుకుంటే అటువంటి వాటికి ప్రత్యేక సమయాలను కేటాయించి, వారికి అనుమతి ఇస్తారన్నారు. డమ్మీ అభ్యర్థులకు సంబంధించిన వాహనాలను తీసుకుని అభ్యర్థులు ప్రచారం చేయరాదనీ, ఒకవేళ అటువంటి వాహనాలు వాడితే కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రచారం చేసే సమయంలో వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులు దేవాలయాలు, చర్చీలు, మసీదుల్లో ప్రచారం చేయరాదనీ, ఒక వేళ చేసిన అభ్యర్థులపై చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా స్థాయిలో, నియోజకవర్గస్థాయిలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తున్నామనీ, ప్రవర్తనా నియమావళి కోసం నియోజకవర్గానికి మూడు బృందాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వీటితో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్, వీడి యో వ్యూయింగ్ టీంలు ఉంటాయని, ఇవన్ని కూడా ఉంటాయన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేయవద్దన్నారు. ఓటింగ్ సమయం నాటికి 48 గంటల వరకు ప్రచారం చేసుకునే వీలు ఉంటుందని, ఆ సమయం దాటిన తర్వాత ప్రచారం చేయరాదన్నారు. ఎన్నికల్లో ఓటర్లను తరలించడానికి ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేసుకోరాదనీ, ప్రైవేటు ఆస్తులపై ప్రచారం చేయరాదని, ఒకవేళ చేసిన అ ఇంటి యాజమానిపై ఒప్పంద పత్రం తీసుకోవాలన్నారు. ప్రచారానికి సంబంధించి పాంప్లెట్స్, పోస్టర్లపైన ప్రింటింగ్ ప్రెస్ పేరు, అడ్రస్, ఫోన్ నంబర్‌తో పాటు, వాటిని ఎవ రూ అచ్చు వేయించారో వారి పేరు కూడా ఉండాలన్నారు. ఎన్నికల సమయంలో డైరీలు, క్యాలెండర్లు, దేవుడి చిత్రపటాలతో ప్రచారం చేయిస్తే నేరం కింద పరిగణలోకి తీసుకుంటామన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు సంబంధించిన హోర్డింగ్స్ వంటి వాటిని స్థానిక సంస్థల నుంచి అనుమతి తీసుకుని పెట్టుకోవాలన్నారు. వివిధ దినపత్రికలు, చానళ్లలో ప్రభుత్వ పథకాలకు సంబంధించిన ప్రకటనలు ఇవ్వరాదన్నారు. అలాగే సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, ట్విట్టర్లలో కూడా ప్రచారం చేయరాదన్నారు.

# ప్రచార సరళిపై ఎమ్మెల్సీ పల్లా ఆరా

## విమర్శలకు ఎక్కడికక్కడే సమాధానాలు
## ప్రజలను నేరుగా కలుసుకోవాలంటూ సూచనలు

నల్లగొండ,అక్టోబర్12 (ఆర్ఎన్ఎ): హుజూర్‌నగర్ ప్రచార బాధ్యతలు భుజాన వేసుకున్న ఎమ్మెల్సీ, పార్టీ ప్రధాన కార్యదర్శి పల్లా రాజేశ్వర్ రెడ్డిరోజువారీగా ప్రచార కార్యక్రమాలను ఆరా తీస్తున్నారు. టిఆర్ఎస్ అభ్యర్థులు ఏ రోజు ఎక్కడెక్కడ ప్రచారం చేస్తున్నదీ, ఏయే అంశాలను ప్రజలకు వివరిస్తున్నదీ సమాచారం సేకరిస్తున్నారు. అవసరమైతే వారికి సూచనలను ఇస్తున్నారు. ప్రచార పంథాలో మార్పులు రావాలని సూచిస్తున్నారు. ప్రజలను తమవైపు తిప్పుకునేలా గ్రామాల వారిగా సమాచారం వెంట ఉంచుకోవాలని సూచిస్తున్నారు. కార్యకర్తలు ప్రజల వద్దకు వెళ్లి ఓట్లు అభ్యర్థించాలని, గ్రామాల్లో ముమ్మర ప్రచారం నిర్వహించాలని పేర్కొన్నారు. తమఅభ్యర్థి సైదిరెడ్డి అత్యధిక మెజార్టీతో గెలుపొందేలా పని చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి టీఆర్ఎస్ గెలుపునకు కృషిచేయాలన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల ముంగిటకు తీసుకువెళ్లాలన్నారు. విభేదాలకు పోకుండా అందరూ సమన్వయంతో కలిసికట్టుగా ముందుకుపోవాల్సిన అవసరం ఉందన్నారు. నియోజకవర్గంలో నాయకులను,గ్రామ పెద్దలను ప్రముఖులను కలసి చర్చించాలన్నారు. టీఆర్ఎస్‌పై విమర్శలు చేస్తున్న ప్రతిపక్షాలపై వెంటనే స్పందించాలని, వారు ఏ సమస్యపై విమర్శ చేసినా ఎక్కడికక్కడనే నేతలు జవాబు చెప్పాలన్నారు. టీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రజలు స్వాగతిస్తున్నారని అభిప్రాయపడ్డారు. ప్రజలు కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కోవలో ప్రచారం ముమ్మరం చేశారు. కారు గుర్తుకు ఓటు వేసి టీఆర్ఎస్ పార్టీని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. తండా, గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వివిధ రకాల పెన్షన్లు ప్రభుత్వం ఇస్తున్నందున ఆయా పెన్షన్లు వస్తున్నాయా లేదా అని ఆరా తీస్తున్నారు. పింఛన్లు రాని వారితో మాట్లాడి ఎందుకు రావడం లేదో తెలుసుకొన్నారు. మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు జరగాలంటే సైదిరెడ్డిని గెలిపించాలని కోరుతున్నారు.




మహాబలిపురం వద్ద సముద్ర తీరంలో ప్లాస్టిక్ వస్తువులను ఏరేస్తూ స్వచ్ఛ భారత్ నిర్వహించిన ప్రధాని మోడీ

## మల్లపురం బీచ్‌లో

# ప్రధాని మోదీ స్వచ్ఛభారత్

- – స్వయంగా అరగంటపాటు చెత్తను తొలగించిన మోదీ
- – వీడియోను ట్విట్టర్‌లో పోస్టు చేసిన ప్రధాని
- – బహిరంగ ప్రదేశాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచన
- – మోదీపై ప్రశంసల జల్లు కురిపిస్తున్న నెటిజర్లు

చెన్నై, అక్టోబర్12(ఆర్ఎన్ఎ) : ప్రధాని మోదీ.. తన అద్భుతమైన ప్రసంగాలతోనే కాకుండా... ఆశ్చర్యానికి గురిచేసే పనులతో కూడా అందర్నీ ఆకట్టుకుంటారు. తాజాగా మోదీ చేసిన ఓ పనికి భారతదేశం అంతా షాక్ అయ్యింది. దేశ ప్రధాని స్థాయిలో ఉన్నా కూడా ఆయన చూపిన నిరాడంబరతకు సెల్యూట్ చేసింది. ఇంతకీ మోదీ ఏం చేశారన్నదే కదా మీ డౌట్. ఓ సాధారణ వ్యక్తిలా సముద్రం తీరంలో అరగంటపాటు తిరిగిన మోదీ... అక్కడున్న చెత్తను స్వయంగా ఆయనే శుభ్రం చేశారు. బీచ్‌లో పడి ఉన్న ప్లాస్టిక్ కవర్లను, బాటిళ్లను ఆయన చేతితో క్లీన్ చేశారు. తమిళనాడులో పర్యటిస్తున్న మోదీ శనివారం తెల్లవారు జామున మామల్లపురం బీచ్‌ను సందర్శించారు. అక్కడ అరగంట పాటు గడిపిన మోదీ.. బీచ్‌లో పడి ఉన్న చెత్తను స్వయంగా ఆయన చేతులతోనే శుభ్రం చేశారు. అరగంటపాటు బీచ్‌లో తిరుగుతూ అక్కడున్న చెత్తను క్లీన్ చేశాడు. ఓ సంచిని పట్టుకొని బీచ్‌లోని ప్లాస్టిక్ బాటిల్స్, ఇతర చెత్తను చేతితో తీసి ఆ సంచిలో వేశారు. అక్కడ సేకరించిన చెత్తను హోటల్ సిబ్బందిలో భాగమైన జయరాజ్‌కు ప్రధాని అప్పగించారు. ఈ సందర్భంగా ఇందుకు సంబంధించిన వీడియోను స్వయంగా మోదీ తన ట్విటర్ ఖాతాలో పోస్టు చేశారు. దానితో పాటు మన బహిరంగ ప్రదేశాలు శుభ్రంగా ఉంచుకోవాలని, చక్కగా ఉండేలా చూద్దామని ఈ సందర్భంగా మోదీ పిలుపునిచ్చారు. అంతేకాకుండా ప్రతీరోజూ వేకువజామున వ్యాయామం చేసి మనం ఆరోగ్యంగా ఉండేలా చూసుకుందామని పేర్కొంటూ ట్వీట్ చేశారు. మోదీ ట్వీట్ చేసిన వీడియో వైరల్‌గా మారింది. ప్రధాని స్థాయిలోని వ్యక్తి ఇంత నిరాడంబరంగా బీచ్‌లో చెత్తను తొలగించడం పట్ల నెటిజర్లు ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. ఇలాంటి వ్యక్తి భారత ప్రధాని కావటం ఎంతో సంతోషంగా ఉందని రీట్వీట్‌లు చేస్తున్నారు.

# మాజీ డిప్యూటీ సీఎం పీఏ ఆత్మహత్య

బెంగళూరు, అక్టోబర్ 12: కర్ణాటక మాజీ ఉప ముఖ్యమంత్రి జీ పరమేశ్వర వ్యక్తిగత సహాయకుడు రమేశ్ ఆత్మహత్య చేసుకున్నాడు. బెంగళూరులోని జ్ఞానభారతి ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. రమేశ్ ఆత్మహత్య ప్రస్తుతం రాష్ట్రంలో కలకలం సృష్టించింది. కర్ణాటక కాంగ్రెస్ నేతలు పరమేశ్వర, మాజీ ఎంపీ అర్ఎల్ జాలప్ప కొడుకు రాజేంద్ర ఇండ్లపై ఆదాయం పన్ను అధికారులు గురువారం, శుక్రవారం దాడులు జరిపారు. పరమేశ్వర ఇంటితో పాటు విద్యా సంస్థల్లో కూడా ఐటీ అధికారులు సోదాలు నిర్వహించారు.తాము సోదాలు నిర్వహించిన వారిలో రమేశ్ లేడని పేరు వెల్లడించడానికి ఇష్టపడని ఓ ఐటీ అధికారి తెలిపారు. రమేశ్ ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియలేదని దర్యాప్తు చేస్తున్నామని పోలీసు అధికారి ఒకరు చెప్పారు. రమేశ్ బలవన్మరణంపై పరమేశ్వరగ్భ్రాంతికి గురయ్యారు. 'ఐటీ సోదాలు జరిగిన సమయంలో అతడు నాతో ఉన్నాడు. ఏమీ జరగదు. ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రమేశ్‌కు ధైర్యం చెప్పాను. అతడు మృదుస్వభావి. అతనెందుకు ఆత్మహత్యకు పాల్పడ్డాడో తెలియట్లేదు. జరిగిన సంఘటన దురదృష్టకరం' అని పరమేశ్వర పేర్కొన్నారు. పరమేశ్వర, అతని సన్నిహితులు, బంధువుల ఇండ్లతో పాటు 30చోట్ల జరిపిన ఐటీ దాడుల్లో 4.25కోట్ల నగదును ఐటీ అధికారులు సీజ్ చేశారు.



క్రీడలు

# కాంస్యంతో సరిపెట్టుకున్న మేరీ

## ఉలన్ ఈవెంట్‌లో పరాజయం పొందిన కోమ్



న్యూఢిల్లీ,అక్టోబర్12(ఆర్ఎన్ఎ): బాక్సింగ్ క్వీన్ మేరీకోమ్.. ప్రపంచ మహిళల చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నది. శనివారం జరిగిన సెమీస్ బౌట్‌లో మేరీ ఓటమి పాలైంది. రష్యాలోని ఉలన్‌లో ఈ ఈవెంట్ జరిగింది. టర్కీకి చెందిన బసనేజ్ కాకిరోగ్లు చేతిలో మేరీ 4-1 తేడాతో పరాజయం చవిచూసింది. వరల్డ్ చాంపియన్‌షిప్‌లో మేరీకోమ్ తొలిసారి 51 కిలోల కేటగిరీలో పోటీపడింది. అయితే వరల్డ్ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో 8 పతకాలు సొంతం చేసుకున్న బాక్సర్‌గా మేరీ రికార్డు క్రియేట్ చేసింది. రెండవ సీడ్, యురోపియన్ ఛాంపియన్ గోల్డ్ మెడలిస్ట్ అయిన బసనేజ్ దూకుడు ప్రదర్శించింది. దీంతో మేరీ ఈ టోర్నీలో కేవలం బ్రాంజ్ మెడల్‌కు పరిమితం కావాల్సి వచ్చింది. స్వర్ణ పతకం గెలిచే అవకాశం మిస్సయినా.. మూడవ సీడ్ మేరీ మాత్రం ప్రపంచ రికార్డు నెలకొల్పింది. ఇప్పటి వరకు వరల్డ్ బాక్సింగ్ ఈవెంట్‌లో .. పురుషులైనా.. మహిళలైనా .. 8 పతకాలు ఎవరూ గెలవలేదు. సెమీస్‌లో రెఫరీ తీర్పుపై భారత్ అపీల్ చేసుకున్నది. వరల్డ్ ఈవెంట్‌లో ఇప్పటివరకు ఆరు స్వర్ణాలు, ఓ రజతం, ఓ కాంస్యం మేరీ గెలుచుకున్నది. మేరీని ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

# హుజూర్‌నగర్ ప్రచారంపై మంత్రి కేటీఆర్ టెలీకాన్ఫరెన్స్



హైదరాబాద్, అక్టోబర్ 12: త్వరలో జరగనున్న హుజూర్‌నగర్ అసెంబ్లీ ఉప ఎన్నిక ప్రచారంపై ఐటీ, పురపాలక శాఖామంత్రి కేటీఆర్ పార్టీ ప్రచారంలో పాల్గొంటున్న పార్టీ ఇంచార్జీలు, సీనియర్ నాయకులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా హుజూర్‌నగర్‌లో జరుగుతున్న ప్రచారం తీరును ఆయన వారిని అడిగి తెలుసుకున్నారు. వారం రోజుల పాటు ఇంటింటి ప్రచారం ఉధృతం చేయాలని మంత్రి అన్నారు. టీఆర్ఎస్‌కు ఓటేస్తే హుజూర్‌నగర్ అభివృద్ధి చెందుతుందని ప్రజలకు తెలుసన్నారు. కేంద్రం నిధులతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని ఉత్తమ్ చెబుతున్నారనీ, కేంద్రంలో, రాష్ట్రంలో ఎక్కడా అధికారంలో లేని వారు నిధులెక్కడి నుంచి తెస్తారో ప్రజలకు చెప్పాలన్నారు. ప్రజలకు చెప్పేందుకు కాంగ్రెస్ దగ్గర ఏముందని మంత్రి ఈ సందర్భంగా అన్నారు. ఓడిపోతాయని తెలిసి కూడా కాంగ్రెస్, బీజేపీలు నీచ రాజకీయాలు చేస్తున్నాయని అన్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే అభివృద్ధి కుంటుపడుతుందన్న విషయం ప్రజలకు చెప్పాలని ఆయన వారికి సూచించారు.

ఈ ఎన్నికల్లో బీజేపీ బలమేంటో తెలిసిపోతుందన్నారు. ఇన్నాళ్ల బీజేపీ మాటలు వట్టి మాటలేనని తేలిపోతుందని మంత్రి అన్నారు. ఇక్కడ బీజేపీ డిపాజిట్ దక్కించుకోవడం కూడా గొప్పేనని ఆయన అన్నారు. ప్రజల్లో బలం లేదని తెలిసిన బీజేపీ.. కాంగ్రెస్‌తో కలిసి పరోక్షంగా పని చేస్తోందని మంత్రి ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీ దొంగ నాటకాన్ని ప్రజల్లో ఎండగట్టాలని పార్టీ శ్రేణులకు మంత్రి సూచించారు. ఈ ఎన్నికల్లో టీఆర్ఎస్ భారీ విజయం ఖాయమని మంత్రి కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.

# నిషేధిత ప్లాస్టిక్ వాడకం.. రూ. లక్ష జరిమానా

హైదరాబాద్, అక్టోబర్ 12: నగరంలోని ముషీరాబాద్ సర్కిల్ పరిధిలో బల్దియా అధికారులు తనిఖీలు చేపట్టారు. షాపింగ్‌మాల్స్, మద్యం దుకాణాలు, ఫుడ్‌కోర్టులలో అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా దుకాణాల్లో స్వచ్ఛత ఉల్లంఘనపై అధికారులు సంబంధిత యజమానులకు జరిమానా విధించారు. అదేవిధంగా టన్నుల కొద్దీ నిషేధిత ప్లాస్టిక్ వాడుతున్న స్పెన్సర్‌పై రూ. లక్ష జరిమానా విధించారు.

సినిమా



# సురేందర్ రెడ్డితో ప్రభాస్?

మెగాస్టార్ చిరంజీవి హీరోగా సురేందర్ రెడ్డి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'సైరా'. ఇటీవల విడుదలైన ఈ చిత్రం ఘనవిజయంగా నిలచింది. ఈ సినిమా తర్వాత 'బాహుబలి' ప్రభాస్‌తో సురేందర్ రెడ్డి పనిచేయబోతున్నాడని తాజాగా ఓ వార్త బయటకు వచ్చింది.

ప్రభాస్ కోసం సురేందర్ రెడ్డి ఓ స్క్రిప్టు సిద్ధం చేయబోతున్నట్టు తెలుస్తోంది. ఓ స్టైలిష్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా ఉండబోతోందని సమాచారం. స్టైలిష్ ఎంటర్‌టైనర్లు రూపొందించడంలో సురేందర్ రెడ్డి సిద్ధహస్తుడు. ప్రభాస్‌కు సరిపడే లైన్ సురేందర్ రెడ్డి వద్ద ఉందట. ప్రభాస్‌తో త్వరలోనే సురేందర్ రెడ్డి కథా చర్చలు జరుపబోతున్నాడని సమాచారం. మరి, ప్రభాస్ కనుక ఓకే చెప్పేస్తే వీరి కాంబినేషన్‌లో ఓ స్టైలిష్ ఎంటర్‌టైనర్ రావడం ఖాయమని విశ్లేషణలు వినబడుతున్నాయి.

# అదుపుతప్పి కారు బోల్తా: డ్రైవర్ మృతి

మహబూబ్‌నగర్, అక్టోబర్ 12 (ఆర్ఎన్ఎ): జడ్చర్లకు సమీపంలోని తిమ్మాపూర్ వద్ద ఘోర రోడ్డుప్రమాదం జరిగింది. బెంగళూరు నుంచి మేడ్చల్ వస్తున్న ఓ కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సమయంలో కారులో ఐదుగురు ప్రయాణిస్తున్నారు. వీరిలో డ్రైవర్ మృతి చెందగా, మిగతా నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు.. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం శంషాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ అతివేగం వల్లే ప్రమాదం జరిగినట్లు పోలీసులు నిర్ధారించారు.

# కర్ణాటక మాజీ డిప్యూటీ సీఎం పీఏ ఆత్మహత్య

బెంగళూరు, అక్టోబర్12(ఆంఎన్ఎ) : కర్ణాటక మాజీ ఉప ముఖ్యమంత్రి జీ పరమేశ్వర వ్యక్తిగత సహాయకుడు రమేశ్ ఆత్మహత్య చేసుకున్నాడు. బెంగళూరులోని జ్ఞానభారతి ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. రమేశ్ ఆత్మహత్య ప్రస్తుతం రాష్ట్రంలో కలకలం సృష్టించింది. కర్ణాటక కాంగ్రెస్ నేతలు పరమేశ్వర, మాజీ ఎంపీ అర్ఎల్ జాలప్ప కొడుకు రాజేంద్ర ఇండ్లపై ఆదాయం పన్ను అధికారులు గురువారం, శుక్రవారం దాడులు జరిపారు. పరమేశ్వర ఇంటితో పాటు విద్యా సంస్థల్లో కూడా ఐటీ అధికారులు సోదాలు నిర్వహించారు. తాము సోదాలు నిర్వహించిన వారిలో రమేశ్ లేదని పేరు వెల్లడించడానికి ఇష్టపడని ఓ ఐటీ అధికారి తెలిపారు. రమేశ్ ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియలేదని దర్యాప్తు చేస్తున్నామని పోలీసు అధికారి ఒకరు చెప్పారు. రమేశ్ బలవన్మరణంపై పరమేశ్వర దిగ్భ్రాం÷-రతికి గురయ్యారు. 'ఐటీ సోదాలు జరిగిన సమయంలో అతడు నాతో ఉన్నాడు. ఏమీ జరగదు. ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రమేశ్‌కు ధైర్యం చెప్పాను. అతడు మృదుస్వభావి. అతనెందుకు ఆత్మహత్యకు పాల్పడ్డాడో తెలియట్లేదు. జరిగిన సంఘటన దురదృష్టకరం' అని పరమేశ్వర పేర్కొన్నారు. పరమేశ్వర, అతని సన్నిహితులు, బంధువుల ఇండ్లతో పాటు 30చోట్ల జరిపిన ఐటీ దాడుల్లో 4.25కోట్ల నగదును ఐటీ అధికారులు సీజ్ చేశారు.

# నవంబర్ 8న విహాన్ ఇండియా ఇన్ సదస్సు

హైదరాబాద్, అక్టోబర్ 12: విద్యార్థుల్లో మొక్కుబడి చదువులకు స్వస్తి పలుకుతూ వారిలో నైపుణ్య అంశాలకు పెద్దపీట వేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించేందుకు నవబంర్ 8వ తేదీన బేగంపేట్‌లోని హోటల్ తాజ్ వివాంటాలో విహాన్ ఇండియా ఇన్ 2040 పేరుతో సదస్సు జరుగనుంది. సిప్ అకాడమీ తోడ్పాటుతో జరుగనున్న ఈ సదస్సులో నగరానికి చెందిన 100 అత్యుత్తమ పాఠశాలల యాజమాన్యాలు, అధ్యాపకులు పాల్గొననున్నారు. 2040 నాటికి భారత్‌ను తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దాలంటే నేటి విద్యార్థులకు ప్రపంచంతో పోటీ పడే విధంగా వారిని తీర్చిదిద్దాల్సి ఉంటుందని, ఇందుకోసం వారిని ఏ విధంగా సన్నద్ధులను చేయాలనే అంశాలపై సదస్సులో సుదీర్ఘంగా చర్చిస్తామని శుక్రవారం బేగంపేట్‌లోని హోటల్ తాజ్ వివాంటాలో జరిగిన సమావేశంలో వక్తలు పేర్కొన్నారు.

ఈ సదస్సుకు సంబంధించిన అంశాలను రియల్ లైఫ్ సైంటిస్ట్, సైన్స్ కమ్యూనికేటర్ డాక్టర్ అర్నాబ్ భట్టాచార్య, టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ నుంచి ప్రొఫెసర్ వసుధ కామత్, డ్రాఫ్ట్ నేషనల్ ఎడ్యూకేషనల్ పాలిసీ కమిటీ సభ్యులు, ఎన్‌సీఈఆర్‌టీ మాజీ జాయింట్ డైరెక్టర్ ఉజ్వల్ భండారీ, గూగుల్ డైరెక్టర్ డాక్టర్ సువెూహన చెన్నప్పయ్య, ఐఐటీ హైదరాబాద్ ఆర్ అండ్ డి డీన్ వనిత డాట్ల, హెచ్‌పీఎస్ ప్రిన్సిపాల్ స్కంద్ బాలి పాల్గొన్నారు.

# ఆర్టీసీని ప్రైవేటీకరించేందుకు కేసీఆర్ కుట్ర

- టీఎన్జీవో, టీజీవో సంఘాలు ప్రభుత్వానికి తొత్తులుగా మారాయి
- ఉపపోరులో కేసీఆర్‌కు గుణపాఠం తప్పదు
- ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

సూర్యాపేట, అక్టోబర్12(ఆర్ఎన్ఎ) : ఆర్టీసీని ప్రైవేటీకరించేందుకు సీఎం కేసీఆర్ కుట్ర చేస్తున్నారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆరోపించారు. శనివారం సూర్యాపేటలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.. సకల జనుల సమ్మె సమయంలోనే కార్మికులను తొలగించలేదని, తెలంగాణ వచ్చిన 6నెలల్లోనే ఆర్టీసీ అప్పుల్లో కూరుకుపోయిందన్నారు. ఆర్టీసీకి 3వేల కోట్ల అప్పులుంటే, ప్రభుత్వమే రూ.2వేల కోట్ల బకాయిలు ఇవ్వాలని తెలిపారు. టీఎన్జీవో, టీజీవో సంఘాలు ప్రభుత్వానికి తొత్తులుగా మారాయని, హుజూర్‌నగర్‌లో కేసీఆర్ బుద్ధిచెప్పేందుకు సిద్ధంగా ఉండాలని మందకృష్ణ పిలుపునిచ్చారు. హుజుర్ నగర్లో జరుగుతున్న ఉపఎన్నికల్లో మాదిగలు, మాలలు టీఆర్ఎస్‌కు ఓట్లు వేయొద్దని, తెలంగాణ రాష్ట్రంలో 12శాతం ఉన్న మాదిగలకు ఒక్క మంత్రి పదవి ఇవ్వని కేసీఆర్ ప్రభుత్వాన్నీ ఈ ఉప ఎన్నికల్లో ఓడించాలని మందకృష్ణ పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ లో అన్ని వర్గాలవారికి ప్రాతినిధ్యం ఇస్తూ , ఐదు ఉపముఖ్యమంత్రి పదవులు ఇచ్చిన జగన్ ప్రభుత్వాన్ని చూసి కేసీఆర్ బుద్ధి తెచ్చుకోవాలని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన ఆర్టీసీ కార్మికుల విషయంలో కేసీఆర్ ఒక నియంతలా వ్యవహరిస్తుండని మందకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ వద్దు అంటూ రాజ్యసభకు రాజీనామా చేసిన హరిక్రిష్ణ చనిపోతే తెలంగాణ ప్రభుత్వంమే అత్యంక్రియలు చేసిందని, తెలంగాణ మూల పురుషుడు అమోస్ అని చెప్పిన కేసీఆర్, అమోస్ చనిపోతే కనీసం సంతాపం కూడా తెలియజేయ లేదని మందకృష్ణ విమర్శించారు. ఉప ఎన్నికల్లో కేసీఆర్‌కు గట్టి గుణపాఠం చెప్పేందుకు ఓట్లు సిద్ధంగా ఉన్నారని మందకృష్ణ హెచ్చరించారు.

## మన బంధంలో..

# కొత్త అధ్యాయం మొదలైంది

- మన సంబంధాలు, సమస్యలపై సున్నితంగా ఉందాం
- ప్రపంచంలో శాంతి, స్థిరత్వం కోసం మనవంతు సహకారం అందిద్దాం
- జిన్‌పింగ్‌తో భేటీలో ప్రధాని నరేంద్ర మోదీ
- మీ ఆతిథ్యంతో మైమరచిపోయాం - జిన్‌పింగ్

చెన్నై, అక్టోబర్12(ఆర్ఎన్ఎ) : భారత్ - చైనా సత్సంబంధాల్లో కొత్త అధ్యాయం మొదలైందని భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. కోవలం వేదికగా చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో మోదీ రెండో రోజు ఇష్టాగోష్ఠి జరిపారు. అనంతరం ప్రతినిధుల బృందం స్థాయి చర్చలు జరిగాయి. ఈ చర్చల్లో మోదీ, జిన్‌పింగ్ తమ భేటీపై అభిప్రాయాలను అధికారులతో పంచుకున్నారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. చెన్నై కనెక్ట్' భేటీతో భారత్-చైనా బంధంలో కొత్త అధ్యాయం మొదలైందన్నారు. వూహాన్‌లో జరిగిన తొలి భేటీనే ఇందుకు స్ఫూర్తి అని, చైనా, తమిళనాడు మధ్య బలమైన వాణిజ్య, సాంస్కృతిక సంబంధాలున్నాయని అన్నారు. ఆర్థికంగా మన రెండు దేశాలు శక్తిమంతమైనవి అని, ఇరుదేశాల మధ్య విభేదాలు పెరగకుండా చూసుకుంటామని హామీ ఇస్తున్నామన్నారు. మన సంబంధాలు, సమస్యలపై సున్నితంగా ఉందామని, ప్రపంచంలో శాంతి, స్థిరత్వం కోసం మనవంతు సహకారం అందిద్దామని మోదీ చెప్పుకొచ్చారు. చెన్నై సమావేశం ఇరుదేశాల మైత్రిని మరింత బలపర్చిందని అన్నారు. వూహాన్ సమ్మిట్ కొత్త ఉత్తేజాన్ని ఇచ్చిందని ప్రధాని తెలిపారు. రెండు దేశాల మధ్య విశ్వాసం మరింత పెరిగిందని తెలిపిన మోదీ.. చెన్నై విజన్‌తో కొత్త శకం ఆరంభమైందన్నారు. అనంతరం చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ మాట్లాడుతూ.. ఈ పర్యటన నేను ఎప్పటికీ మరువలేను అని, మీ ఆతిథ్యం మమ్మల్ని మైమరచిపోయేలా చేసిందని అన్నారు. నాకు, నా సిబ్బందికి ఈ పర్యటన ఓ మధుర జ్ఞాపకంలా మిగిలిపోతుందన్నారు. మోదీజీ మీరన్నట్లుగానే మన మధ్య స్నేహపూర్వక చర్చలు జరిగాయని జిన్‌పింగ్ కొనియాడారు. తాము గాఢ స్నేహితుల్లా, హృదయపూర్వకంగా చర్చలు జరిపామని, ఈ చర్చలు రెండు దేశాల సంబంధాలను మరింత బలోపేతం చేస్తాయని ఆశిస్తున్నామని ఆయన అన్నారు. ఈ చర్చల అనంతరం కోవలం రిసార్ట్‌లో ఏర్పాటు చేసిన చేనేత వస్తువులు, కళాఖండాల ప్రదర్శనను మోదీ, జిన్‌పింగ్ సందర్శించారు. విందు భేటీలో మంరోసారి చర్చలు జరిపిన అనంతరం జిన్‌పింగ్ తిరుగు పయనమవనున్నారు. భారత ప్రధాని నరేంద్రమోదీ జిన్‌పింగ్ కాన్వాయ్ వద్దకు స్వయంగా వెళ్లి అతడిని సాగనంపారు.

# కాంగ్రెస్ బీజేపీలు కుమ్మక్కయ్యాయి: మంత్రి జగదీష్ రెడ్డి

హుజూర్ నగర్, అక్టోబర్ 12: హుజూర్ నగర్ అసెంబ్లీ ఉప ఎన్నికలో జాతీయ పార్టీలుగా భావించే కాంగ్రెస్, బీజేపీలు కుమ్మక్కయ్యాయని మంత్రి జగదీష్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. బద్ధ శత్రువులైన కాంగ్రెస్, బీజేపీలు టీఆర్ఎస్ ను ఓడించేందుకు విఫల ప్రయత్నాలు చేస్తున్నాయని మంత్రి ఆరోపించారు. ఈ కథ అంతటికీ కారణం.. స్క్రీన్ ప్లే, దర్శకత్వం ఉత్తమ్ కుమార్ రెడ్డి అని ఆయన ఎద్దేవా చేశారు. పాత్రలు, పాత్రధారులు కమలనాథులని తెలిపిన మంత్రి టీ ఆర్ ఎస్ ను దెబ్బతియ్యడమే లక్ష్యంగా వారి కుట్రలు సాగుతున్నాయన్నారు. ఎల్లలు దాటుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్టను అడ్డుకునేందుకే వారి ప్రయత్నాలు జరుగుతున్నాయని మంత్రి ఆరోపించారు. తెలంగాణ పథకాలు యావత్ భారతదేశాన్ని ఆకట్టుకుంటున్నాయన్నారు. కుట్రలను ఛేదించేందుకు హుజూర్ నగర్ ఓటర్లు సన్నద్ధమవ్వాలని ఆయన ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. టీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సైదిరెడ్డితో కలిసి ప్రచారంలో పాల్గొన్న మంత్రి ఈ విధంగా స్పందించారు. జాతీయస్థాయిలో పరస్పరం విరుద్ధంగా ఉండే కాంగ్రెస్, బీజేపీల కుట్రలను విచ్ఛిన్నం చేయాలని ఓటర్లకు మంత్రి విన్నవించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచనలకు మైలురాయిగా నిలిచిన రైతుబంధు, రైతుభీమా పథకాలను తమ తమ రాష్ట్రాలలో కూడా అమలు చేయాలన్న ప్రజల డిమాండ్ ను పక్కదోవ పట్టించేందుకే హుజుర్నగర్ ఎన్నికలలో కాంగ్రెస్, బీజేపీలు నాటకీయంగా కలిసిపోయాయని ఆయన ఎద్దేవా చేశారు. ఇప్పటికే ఈ విషయం ప్రజలకు అర్థం అయిందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వాన్ని బలపర్చేందుకు ప్రజలు ఎప్పుడూ సిద్ధంగానే ఉన్నారని మంత్రి అన్నారు. 2018 లో కూడా హుజూర్ నగర్



గెలుపు టి ఆర్ ఎస్ నే వరించిందనీ, అయితే సాంకేతికంగా అది కాంగ్రెస్ ఖాతాలో జమ అయిందని తెలిపారు. 2018 ఎన్నికలలో ఓటమి పాలయినప్పటికీ, మా పార్టీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి నియోజకవర్గంలోనీ ప్రజలతో కలిసి పోయాడనీ.. ఈ ఎన్నికల్లో గులాబీ విజయం తథ్యమని మంత్రి జగదీష్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

# జలమండలి.. ఇంటింటి సర్వే..



హైదరాబాద్, అక్టోబర్ 12: నెలవారీ ఆదాయాన్ని పెంచుకునే దిశగా జలమండలి అధికారులు చర్యలు ప్రారంభించారు. సంస్థలో చురుగ్గా ఉన్న 150 మంది సిబ్బందితో నేటి (శనివారం) నుంచి నగరంలో ఇంటింటి సర్వే చేపట్టాలని ఎండీ దానకిశోర్ నిర్ణయించారు. ఈ మేరకు ఖైరతాబాద్ సంస్థ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం సర్వే చేపట్టే సిబ్బందికి ఒక్క రోజు శిక్షణ ఇచ్చారు. 150 మంది సిబ్బందిని 50 బృందాలుగా ఏర్పాటు చేసి, జీఎం, డీజీఎం, మేనేజర్ సాయంతో ఎంపిక చేసిన ప్రాంతాల్లో ఇంటింటికి పూర్తి సర్వే చేసే కస్టమర్ నంబరు, మీటర్ వివరాలు, ఇంటి వైశాల్యం, ఎన్ని గదులు, అంతస్తులు, కనెక్షన్ కేటగిరీ వంటి వాటిపై వివరాలు సేకరించే అంశాలపై శిక్షణ ఇచ్చారు. నల్లా కనెక్షన్ బోర్డు నిబంధనలకు అనుగుణంగా ఉందా? లేదా అనే పరిశీలించాలి? ఒకవేళ డొమెస్టిక్ కనెక్షన్ ఉండి ఆ భవనంలో వాణిజ్య కార్యకలాపాలు కొనసాగితే ఆ కనెక్షన్‌ను కమర్షియల్ కేటగిరిలోకి మార్పు చేసేందుకు ఇంటింటి సర్వే చేపట్టనున్నారు. తొలుత ఈ సర్వే 5, 6, 7, 9, 10, 11 డివిజన్ల పరిధిలో చేపట్టనున్నారు. ఆనంతరం నగర వ్యాప్తంగా సర్వే నిర్వహించనున్నామని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఎండీ దానకిశోర్ మాట్లాడుతూ.. సంస్థ నెలవారీ రెవెన్యూ రూ. 120కోట్లు కాగా, ఖర్చు రూ. 150 కోట్లకు చేరిందన్నారు. ప్రతి నెలా రూ. 30కోట్ల లోటు బడ్జెట్‌తో నెట్టుకొస్తుందని వివరించారు. కాబట్టి లోటులో ఉన్న బోర్డు ఆదాయం పెంచుకోవాల్సిన అవశ్యం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు. ఈ సర్వేలో భాగంగా ఎంపిక చేసిన 150 మంది సిబ్బంది ఇంటింటికి వెళ్లి బోర్డు నిబంధనలకు అనుగుణంగా కనెక్షన్ ఉందా లేదా, అక్రమ నల్లా కనెక్షన్ గుర్తించనున్నారని తెలిపారు. అక్రమ నల్లా కనెక్షన్‌ను క్రమబద్ధీకరించడం, నాన్ డొమెస్టిక్ కనెక్షన్ ఐతే మీటర్ బిగింపు, నీటి వృథా అరికట్టడానికి అవగాహన కల్పించడం వంటి వాటిపై సర్వే చేపట్టా లనని సూచించారు. నీటి వృథాను అరికడితే బోర్డుకు మరింత ఆదాయం చేకూరుతుందని అభిప్రాయపడ్డారు.

# అథ్లెటిక్ పోటీలు ప్రారంభించిన మంత్రి జగదీష్ రెడ్డి

సూర్యపేట, అక్టోబర్ 12: రాష్ట్రస్థాయి ఆరవ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ పోటీలను మంత్రి జగదీష్ రెడ్డి సూర్యపేటలో ప్రారంభించారు.

మంత్రి క్రీడలను ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. వారితో కరచాలనం చేసి ఉత్సాహంగా గడిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సూర్యపేటను క్రీడా వేదికగా రూపొందిస్తామనీ, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా క్రీడా మైదానాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. 2014 తర్వాత అనేక క్రీడా పోటీలకు సూర్యపేట వేదికగా నిలిచిందని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా మానసిక ఎదుగుదలకు తోడ్పడుతుందని అన్నారు. శారీరకంగా బలంగా తయారవడానికి క్రీడలు దోహదపడతాయని మంత్రి అన్నారు.

విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి లోపించడంతో మానసిక ?స్థైర్యం కోల్పోతారని మంత్రి ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. చదువు కంటే కూడా క్రీడలు రుగ్మతలను రూపుమాపుతాయని ఆయన అన్నారు. ఓటమి నుంచే గెలుపు పుడుతుందన్న అంశాన్ని విద్యార్థులు గ్రహించాలనీ, చిన్న చిన్న పరాజయాలకే కృంగిపోకూడదన్నారు. కార్యక్రమంలో మంత్రితో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులు, ఫిజికల్ డైరెక్టర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.